నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
ఆదివారం | డిసెంబర్ 17, 2023 | www.navatelangana.com

విజ్ఞాన భారతిలో విజయ్ దివాస్ వేడుకలు

నవతెలంగాణ-కాశిబుగ్గ



కాశిబుగ్గలోని శ్రీసాయి విజ్ఞాన భారతి హైస్కూల్‌లో శనివారం విజయ్‌దివాస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్ రెడ్డి మాట్లాడుతూ 1971 డిసెంబర్ 16న పాకిస్తాన్‌పై భారత సాయుధ దళాలు సాధించిన విజయానికి గుర్తు గా విజయ్‌దివాస్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన సైనికుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివాస్ వేడుకలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని శశిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రోజా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-నెక్కొండ



హెచ్ఐవి ఎయిడ్స్ మహమ్మారి పట్ల ప్రతి ఒక్కరు చైతన్యం కలిగి ఉండి అవగాహన పెంపొందించుకోవడం ముఖ్యమని నెక్కొండ గ్రామ సర్పంచ్ సొంటిరెడ్డి యమున రంజిత్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రపంచం ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని సర్వోదయా యూత్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యోదయ హై స్కూల్ లో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రన మండలి ఆదేశానుసారంగా విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, ముగ్గులు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి, ఆడెపు రామకష్ణ, కమలాకర్, శాంతరాజ్, కౌన్సిలర్ రాణి, రేణుక, షరీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు సత్వరమే కల్పించాలి

- కుడా వీసీ షేక్ రిజ్వాన్ బాషా



నవతెలంగాణ-వరంగల్

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఉనికి చర్ల లేఅవుట్లో ప్రజల సౌకర్యార్థం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను త్వరితంగా పూర్తిచేయాలని వైస్ చైర్మన్, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన ఉనికిచెర్ల యూని లేఅవుట్ ప్లాట్‌లలో ప్రజల సౌకర్యార్థం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలైన డ్రైనేజీ, ఎలక్ట్రిసిటీ, మంచినీటి సరఫరా పైప్ లైన్ల ఏర్పాటు తదితర పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా షేక్ రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్లో మొట్టమొదటిసారిగా నూతన సాంకేతికతను ఉపయోగించి యూని లేఅవుట్ లోని అన్ని ప్లాట్‌లకు డ్రైనేజ్ మంచినీటి సరఫరా, విద్యుత్, పైప్లైన్లు సమాంత రంగా నాణ్యతతో అండర్ గ్రౌండ్ లో అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఆ యాపనుల్లో వేగంపెంచి వచ్చే జనవరి మొదటి వారంలోగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వైస్‌చైర్మన్ వెంట కుడా ప్రాజెక్ట్ అధికారి అజిత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమ్‌రావులు ఉన్నారు.

మంత్రి సురేఖను కలిసిన రామాలయ కమిటీ

నవతెలంగాణ-కాశిబుగ్గ



రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాదులో శనివారం కాశిబుగ్గ (ఓసీటీ)లోని సీతా రామాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రి సురేఖకు పూల బొకే అందించి శాలువతో సత్కరించారు. రామాలయ అభివృద్ధికి కృషిచేయాలని వారుకోరగా అందుకు మంత్రి కొండాసురేఖ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆలయాన్ని సందర్శించవలసిందిగా మంత్రి కొండ సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్‌రావులను ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడువెలిశాల ఆనంద్ కుమార్, కార్యదర్శి దాసరి రాజేష్, ప్రతినిధులు పాలకోజు కరుణాకర్, కూచన రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన పద్మ

నవతెలంగాణ-పర్వతగిరి



మంత్రి కొండా సురేఖను శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ మహిళా నాయకురాలు తొర్రి పద్మ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మంత్రికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కలిసిన నాయకులు

నవతెలంగాణ-పర్వతగిరి



వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజును శనివారం హైదరాబాద్‌లో పర్వతగి కాంగ్రెస్ నాయకులు చీదురు మల్లేష్, చీదురు యాకయ్య, బండి సమ్మయ్య, ఓ స శంకర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఖానాపురం



ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని బుధరావుపేట గ్రామంలో రైతు వేదిక సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం మంగళవారిపేటకు చెందిన ఆబోతు సాంబరాజు (32) ధర్మరావుపేట గ్రామంలోని రైస్‌మిల్లులో హమాలిగా పనిచేస్తున్నాడు. బుధరావుపేట గ్రామంలో రైతు వేదిక సమీపంలో కొత్తిమాటు గ్రామానికి చెందిన రైతు గుగులోతు భద్రు ప్రధానరహదారి ప్రక్కన వరిధాన్యంఆరబోసి పరదాలు కప్పి ఉంచారు. పరదాలు గాలికి లేవకుండా చుట్టూ బండరాళ్లు పెట్టి ఉంచారు. రోజువారి దినచర్యలో భాగంగా సాంబరాజు శనివారం ఉదయం తనకున్న ద్విచక్ర వాహనంపై పనికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఇద్దరు మహిళలు లిఫ్ట్‌అడగగా వాహనంపై ఎక్కించుకొని వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ధాన్యంపై ఉన్న బండరాయికి తాకి ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఎదురుగా ఉన్న గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. సాంబరాజు తల,ఛాతికి బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందగా ఇద్దరు మహిళలు తీవ్ర గాయాల పాలయ్యారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.

మృత్యుకుహరాలుగా వరి ధాన్యకుప్పలు ...

రైతులు అవసర రీత్యా రహదారులపై ధాన్యం ఆరబోస్తున్నారు. రాత్రి వేళలో ప్రయాణించే ప్రయాణికులకు ధాన్యం కుప్పలు మత్యు శకటాలుగా మారి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో కూడా రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలతో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి రహదారులపై రైతులు ధాన్యం ఆరబోయకుండా ప్రయాణికులకు ఆటంకం కలగకుండా తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఖోఖో పోటీలకు మూడు జానకి ఎంపిక

నవతెలంగాణ-నెక్కొండ

కర్ణాటక రాష్ట్రంలోని టిప్పూర్ జిల్లాలో ఈనెల 17 నుండి 19 వరకు జరుగు 33వ సబ్ జూనియర్స్ జాతీయస్థాయి ఖో-ఖో పోటీల్లో సూరిపల్లి జెడ్పీహెచ్ఎస్ 8వ తరగతి విద్యార్థిని మూడు జానకి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బత్తుల పరమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి జానకిని, కోచ్ రాంబాబు, ఎంఈవో వనమల్ల రత్నమాల, సూరిపల్లి హెచ్ఎం బత్తుల పరమేశ్వర్, సర్పంచ్ సింగారపు గీత భాస్కర్, ఎంపీటీసీ మాదాటి శారద శ్రీనివాస్, ఎస్ఎంసి చైర్మన్ పరకాల వెంకట మల్లు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్ జోగయ్య రమేష్, శాంతవతి, నర్సింగరావు, అన్నపూర్ణ, బాబు, వెంకటలక్ష్మి, మహేశ్వర్, వీరలక్ష్మి లు అభినందించారు.

బీఆర్ఎస్‌లో 'తక్కళ్లపల్లి' వ్యాఖ్యలపై చర్చ

- సరైనవేనంటున్న పార్టీ వర్గాలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు బీఆర్ఎస్ ఓటమి అనంత రం చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో ప్రకంపనలు రేకెత్తిస్తున్నాయి. ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌లాంటి వారికి మంత్రి పదవులు ఇవ్వడం పట్ల ఉద్యమకారులు బాధపడ్డారని చేసిన వ్యాఖ్యల పట్ల పార్టీ శ్రేణుల్లో సానుకూలత వ్యక్తమవు తుంది. ఇతర పార్టీల నుండి టీఆర్ఎస్‌లో చేర్చుకున్న ఎమ్మెల్యేలు పార్టీ నేతలు తొక్కేశారని, జోకుడుగాళ్లకు ప్రాధాన్యతనిచ్చి, వాస్తవాలు చెప్పేవారికి అవకాశం లేకుండా చేశారని చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'తక్కళ్లపల్లి' వ్యాఖ్య లు సరైనవేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఓటమి నేపథ్యంలో జిల్లా స్థాయిలో నేటికీ సమీక్ష జరుగకపోవడం గమనార్హం. పార్టీ నిర్మాణంపై రాష్ట్ర నాయకత్వం దృష్టి సారించకపోవడం, ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోకపోవడమే కొంపముంచిందని పార్టీ నేతలు వాపోతున్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పార్టీ ఓటమినేపథ్యంలో చేసిన ఘాటైన వ్యాఖ్యలు ఉమ్మడి వరంగల్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. పార్టీ నాయకత్వం చేసిన తప్పులపై 'తక్కళ్లపల్లి' బహిరంగంగా విమర్శలు చేయడం పార్టీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చసాగుతుంది. ఎమ్మెల్సీ రవీందర్‌రావు చేసిన వ్యాఖ్యలు వాస్తవమని, ఈ విషయాలను క్షేత్రస్థాయి లో చెప్పినా, పార్టీ రాష్ట్ర నాయకత్వం పరిగణనలోకి తీసుకోలేదని పార్టీవర్గాల్లో చర్చ జరుగుతుంది. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే బాస్ అని తీసుకున్న నిర్ణయంతో ఇతర పార్టీల నుండి పార్టీలోకి చేర్చుకున్న ఎమ్మెల్యేలు స్థానిక టీఆర్ఎస్ నేతలను, కార్యకర్తలను, ఉద్యమకారులను తొక్కేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ ప్రత్యేకించి ప్రస్తావించారు. ఈ విష యమై రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో, పలు నియోజ కవర్గాల్లో ఉద్యమకారుల సమావేశాల పేరిట ఉద్యమకారులు చర్చించి ప్రశ్నించినా, నాయకత్వం పట్టించుకోలేదు. ఎమ్మెల్యేలుగా వుంటూ చేసిన అక్రమాలపై ఉద్యమకారులు స్పందించి నాయకత్వం దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదు.

ఎమ్మెల్యేలు చేసిన అక్రమాలను పార్టీ నాయకత్వం చూసి చూడనట్టు వ్యవహరించడమే తాజా ఓటమికి కారణమని పార్టీ శ్రేణులు బహిరంగంగా అభిప్రాయపడుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేల అకృత్యాలకు బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యులే ఓటు వేయకుండా ప్రత్యామ్నాయ పార్టీకి ఓటు వేసిన పరిస్థితి దాపురించడం గమనార్హం.

ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తి

బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యంగా సీఎం కేసీఆర్ నాడు తీసుకున్న నిర్ణయాలతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం ఏర్పడింది. అవసరం లేకున్నా ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడం, వారికి పార్టీలో అత్యంత ప్రాధాన్యతనివ్వ డంతో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమైనా పార్టీ నాయకత్వం పట్టించుకోలేదు. ఎమ్మెల్యేల కుటుంబసభ్యులకే పలు పదవులు ఇవ్వడం కూడా విమర్శలకు తావిచ్చింది. ఈరకమైన వ్యవహారాల వల్ల పార్టీ శ్రేణులు రాష్ట్ర నాయకత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతను పెంచుకున్నారు. ప్రశ్నిస్తే సహించలేకపోవడంతో పార్టీ శ్రేణులు సైతం అవకాశం కోసం ఎదురుచూశా యి. ఈ క్రమంలో తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులే కర్రు కాల్చివాత పెట్టాయి.

పార్టీ నిర్మాణంపై శ్రద్ధేదీ..?

బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ నిర్మాణంపై ఏనాడు శ్రద్ధ కనపరచలేదు. పార్టీ రాష్ట్ర కార్యవర్గంతో పాటు, జిల్లా అధ్యక్షులు వుంటారే తప్పా జిల్లాల్లో పార్టీ కార్యవర్గాలు వుండవు. రాష్ట్ర కార్యవర్గంలోనూ కేసీఆర్ చెప్పిందే నిర్ణయాలు చేయడం మినహా మరొకటి ఇప్పటి వరకు జరుగలేదు. జిల్లాల్లో సైతం ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లనే పార్టీ అధ్యక్షులుగా నియమించారే తప్పఇతర నేతలకు అవకాశం కల్పించలేదు. దీంతో పార్టీ ద్వితీయశ్రేణి నాయకత్వంలో పార్టీ నాయకత్వం పట్ల, ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఉత్పన్న మైంది. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి వుందని తెలిసినా, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు తేలిగ్గా తీసుకున్నారు. డబ్బునే నమ్ముకున్నారు. ప్రజలు మావైపేనంటూ అతివిశ్వాసానికి పోయి భంగపడ్డారు.

'తక్కళ్లపల్లి' వ్యాఖ్యలు సరైనవే..

ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు చేసిన వ్యాఖ్యలు సరైనవేనని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. ఇతర పార్టీల నుండి వచ్చిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇచ్చి, ఉద్యమకారులను తొక్కేసినా పట్టించుకోకపోవడమే ఈ ఓటమికి కారణమని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఎమ్మెల్యేలే బాస్‌లని ప్రకటించి, వారు చేసిన అవినీతి, అక్రమాలపై చర్యలుతీసుకోకపోవడంతో ప్రజల్లో పలుచనయ్యామని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓటమిని పాలకుర్తి ప్రజలు ఎప్పుడో ఖరారు చేశారని ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలు గమనార్హం. పాలకుర్తి నియోజకవర్గం నుండి పార్టీ టికెట్‌ను 'తక్కళ్లపల్లి' గతంలో ఆశించారు. ఆయన్ను కాదని 'ఎర్రబెల్లి'కి నాయకత్వం పార్టీ టికెట్ ఇచ్చింది. వీరిద్దరి మధ్య రాజకీయ వైరుధ్యాలున్నాయి. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో 'తక్కళ్లపల్లి'కి ఎలాంటి విభేధాలు లేవు. 'ఎర్రబెల్లి', సత్యవతి టీడీపీ నుండి బీఆర్ఎస్‌లో చేరారు. వీరిద్దరికీ ప్రాధాన్యతనిచ్చి, వీరి కంటే ముందు నుండి పార్టీలో వుండి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేతలకు ప్రాధాన్యతనివ్వకపోవడం గమనార్హం.

డోర్నకల్ నియోజకవర్గంలో నూకల నరేష్‌రెడ్డి, రామసహాయం రంగారెడ్డి ఉద్యమ కాలం నుండి పార్టీలో చురుగ్గా వ్యవహరించారు. వీరికి ప్రభుత్వపరంగా ఎలాంటి ప్రాధాన్యత కలిగిన పోస్టులభించలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటి ఉదాహరణలు ఎన్నో వున్నాయి. 'తక్కళ్లపల్లి' ఉమ్మడి వరంగల్ జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడిగా వ్యవహరించినా, ఆలస్యంగా ఆయనకు ఎమ్మెల్సీ పదవి దక్కింది. ఇంకా ఎంతో మంది ఉద్యమకారులను ఎమ్మెల్యేలుగా వున్న నేతలే తొక్కడం గమనార్హం.

ఈ క్రమంలోనే 'తక్కళ్లపల్లి' చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

అరూరా...! మజాకా...!!

- మాజీ అయినా మరువని దందా
- రాళ్లు రప్పలు గుట్టలను సైతం వదలని వైనం
- బినామీలతో అక్రమదందా
- లీజు పూర్తయిన గలీజు దందా
- బెదిరింపులతో బెంబేలెత్తుతున్న బాధిత యజమాని

నవతెలంగాణ-హసన్‌పర్తి







దశాబ్దకాలంగా ఏకచత్రాధిపత్యంగా అధికారంలో ఉన్న ఓ మాజీ ఎమ్మెల్యే తన పంతాను మార్చుకోలేదన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. తన అహంకార పూరితమైన నిర్ణయాలతో నియోజకవర్గంలో తనకు ఎదురులేకుండా స్థానం పదిలం చేసుకున్న ఆ మాజీ ఎమ్మెల్యేకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా తన పంతాను మార్చుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. తన అక్రమ సంపాదనతో కోట్లకు పడగలెత్తిన మాజీ ఎమ్మెల్యే... పదవీచ్యుతుడైనా అహంకార పూరితమైన వ్యవ హారాన్ని మార్చుకోలేదన్న నిందలుతప్పడం లేదు. ప్రభుత్వ, పంచరాయి, వివాదాస్పద భూములు, రాళ్లురప్పలు, చెరువు లు, కుంటలు, గుట్టలను సైతంవదల కుండా తన అక్రమ దందాను యధేచ్ఛగా కొనసాగిస్తున్నాడన్న అపవాదు అతనికి తప్పడంలేదు. బినామీలపేరుతో తన అక్రమ దందాను మూడు పువ్వులు, ఆరుకాయలుగా పెంచుకుంటూ బాధితులపై బెదిరింపులకు పాల్పడుతున్నాడన్న విమర్శలున్నాయి. లీజు పూర్తి అయినా తన గలీజు దందాతో బాధితులను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా తన అనుచరులతో బెదిరింపులకు పాల్పడుతూ అవసరమైతే దాడులకు పాల్పడేందుకు సిద్ధపడతానని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే బాధితులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. బాధితుడి కథ నం ప్రకారం వివరాల్లోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన పరుచూరి కృష్ణమోహన్ గ్లోబల్‌గ్రానైట్ పేరుతో జయగిరి గ్రామంలోని సర్వేనెంబర్ 468/1, 469/1లో గల 3.50 హెక్టార్ల విస్తీర్ణం గల గుట్టను 20 సంవత్సరాల గాను 2007లో లీజు తీసుకొని క్వారీ నిర్వహిస్తున్నాడు.

ఈ క్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తనయుడు అరూరి విశాల్ ఇదే క్వారీని పరుచూరి కృష్ణ మోహన్ వద్ద రెండుసంవత్సరాల సబ్‌లీజ్‌తో క్వారీని నిర్వహిస్తున్నాడు. క్వారీ నిర్వాహకుడిగా రాజేశ్వర్‌రెడ్డి వ్యవహారం చక్కబెడుతూ వస్తున్నాడు. నిబంధనల ప్రకారం సెప్టెంబర్ 2023తో ఇరువురి మధ్య కుదరిన ఒప్పందం ముగిసింది. అయితే అప్పటి వరకు క్వారీ నిర్వహణకు సంబంధించి లీజు లావాదేవీలు చెల్లింపుల విషయంలోతగాదాలు మొదలయ్యాయి. ఒప్పందం ప్రకారం సబ్ లీజు అగ్రిమెంట్ హోల్డర్ అరూరి విశాల్ గత బకాయిలు చెల్లించి తిరిగి క్వారీ కొనసాగించాలని అసలు లీజు అగ్రిమెంట్ హోల్డర్ పరుచూరి కృష్ణమోహన్ క్వారీనిర్వహణను అడ్డుకున్నాడు. దీంతో మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమారుడు అరూరి విశాల్ క్వారీ నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న రాజేశ్వర్‌రెడ్డి తమకు మరో మూడు నెలల పాటు అవకాశం ఇస్తే బకాయిలు డబ్బులతో పాటు లీజ్ అగ్రిమెంట్ ఒప్పందం ప్రకారం ఉన్నది ఉన్నట్టుగా క్వారీని వదిలి వెళ్తామని లీజ్ అగ్రిమెంట్ హోల్డర్ కృష్ణమోహన్‌కు హామీ ఇచ్చారు. ఒప్పందం ప్రకారం డిసెంబర్ 8వ తేదీతో మూడునెలల గడువు ముగిసినప్పటికి బకాయి డబ్బులు చెల్లించకుండా క్వారీని విడిచివెళ్లకుండా మాజీ ఎమ్మెల్యే రమేష్, సబ్ లీజ్ అగ్రిమెంట్ హోల్డర్ ఆరూరి విశాల్, క్వారీ నిర్వాహకుడు రాజేశ్వర్‌రెడ్డి తన అనుచరులతో బెదిరింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బాధితుడు పరుచూరి కృష్ణమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే తన అనుచరుల వేధింపుల నుండి తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితుడు కృష్ణమోహన్ పోలీసు ఉన్నతాధికారులను వేడుకుంటున్నాడు.

ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అనుచరుడు రాజేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా మాజీ ఎమ్మెల్యే, అతని కుమారుడికి, అతని అనుచరులకు క్వారీతో ఎలాంటి సంబంధం లేదని న్యాయబద్ధంగానే సమస్యను పరిష్కరించుకు నేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

లీజు అగ్రిమెంట్ ప్రకారమే మెదులుకోవాలి : తుమ్మగోపి, సీఐ

క్వారీ నిబంధనల ప్రకారం లీజు ఒప్పందం ప్రకారమే నడుచుకోవాలని ఎవరు అతిక్రమించినా వారిపై చర్యలు తీసుకుంటామని హసన్‌పర్తి సీఐ తుమ్మగోపి తెలిపారు. అగ్రిమెంట్ ముగిసినందున లీజు ఒప్పందం ప్రకారం క్వారీని వదిలి వెళ్లాలని క్వారీ నిర్వాహకుడు రాజేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు.

నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు

- గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

నవతెలంగాణ-వరంగల్

నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుపుతామని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బల్దియా పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయిన వివిధ అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల కోసం హన్మకొండ ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మకొండ బాలసముద్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపం లో నిర్మించిన సీసీ రోడ్ పనులు, నంది హిల్స్, శాయంపేట, ప్రెసిడెన్సీ స్కూల్ సమీపంలో డ్రైన్‌లు, గోకుల్ నగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ లను పరిశీ లించారు. వివిధ బడా భవనాల నిర్మాణాల అనుమతుల కోసం టీఎస్ బీ-పాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న నేపథ్యం లో వాటికి అనుమతులు మంజూరు చేయడం కోసం హన్మకొండ ప్రాంతంలో బాలసముద్రం, ప్రశాంత్ నగర్, నంది హిల్స్, హాసన్ పర్తి, బీమారం, నయీం నగర్ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కమర్షియల్ నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ల జారీ కోసం నిర్మాణాల ను పరిశీలించారు.



అంతకు ముందు బాలసముద్రం లో గల క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం ను సందర్శించిన కమీషనర్, శిక్షణ కలెక్టర్ కు ఇంజనీరింగ్ అధికారులు క్వాలిటీ నిర్ధారణ తీరు ను వివరించారు. ఈ కార్యక్రమంలో డిఈ సంతోష్‌బాబు, టౌన్ ప్లానింగ్ అధికారులు బషీర్, సుష్మ, ఏ ఈలు కార్తీక్ రెడ్డి, అజ్మీరా శ్రీకాం త్, శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ తదితరులు పాల్గొ న్నారు.

జీపీ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడిగా తగరం శివ

నవతెలంగాణ-హసన్‌పర్తి

గ్రామ పంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్ల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా హసన్‌పర్తి మండలానికి చెందిన తగరం శివ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జీపీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతళ్ల సదానందం, రాష్ట్ర కార్యదర్శి వంగా రవీందర్ ప్రకటించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన హనుమకొండ జిల్లా గ్రామ పంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్‌ల ఉద్యోగుల జిల్లా సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా తగరం శివ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కమలాపూర్ కుమ్మడి నగేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎల్కతుర్తికి చెందిన గుడెల్లి లక్ష్మణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడిగా వెనుకమూరి ఆనందరావు (పరకాల), జిల్లా కోశాధికారిగా పోరెడ్డి మల్లారెడ్డి (ఆత్మకూరు), జిల్లా కార్యదర్శిగా నల్ల చిరంజీవి (దామెర), జిల్లా కార్యవర్గ సభ్యులుగా చల్ల దామోదర్‌రెడ్డి (ధర్మసాగర్), నీలం కుమార్ (భీమదేవరపల్లి), పర్శ భాస్కర్ (నడికుడ), మ్యాక వెంకటేష్ (వేలేరు), మేరుగు నిరంజన్ (ఐనవోలు)లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు ప్రకటించారు.

నేడు ఎమ్మెల్యే నాగరాజు విజయోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-హసన్‌పర్తి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు విజయోత్సవ ర్యాలీ ఆదివారం ఉదయం 9గంటలకు హసన్‌పర్తి మండల పరిధి ఎర్రగట్టు గుట్ట వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమవుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి తెలిపారు. మొదట ఎర్రగట్టుగుట్ట క్రాసురోడ్డులోని ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం 9 గంటలకు మొట్టమొదట స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం హసన్‌పర్తిలో ర్యాలీ ప్రారంభమై సీతంపేట, గంటూర్‌పల్లి, పెంబర్తి మీదుగా సీతనాగారం గ్రామాల మీదుగా అంబాల క్రాసురోడ్డులోని అమిత్ గార్డెన్‌కు చేరుకున్నాక ఎమ్మెల్యే సన్మాన కార్యక్రమం ఉంటుదన్నారు. ఈ ర్యాలీని నియోజకవర్గ, హసన్‌పర్తి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

చంద్రబాబును కలిసిన టీడీపీ నాయకులు



నవతెలంగాణ-కాశిబుగ్గ

టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ గత 90 రోజులుగా దీక్ష చేస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన చెన్నోజు రఘుబాబు శనివారం చంద్రబాబును కలుసుకొని దీక్ష విరమించారు. రఘుబాబు టిడిపికి, చంద్రబాబుకు వీర అభిమాని. చంద్రబాబు అరెస్టుతో తీవ్ర మనస్థాపానికి గురైన రఘుబాబు సెప్టెంబర్ 19న నగరంలోని భద్రకాళి దేవాలయంలో దీక్ష తీసుకుని చంద్రబాబును విడుదల అనంతరం ఆయనను కలిసి దీక్ష విరమించారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా టిడిపికి, ప్రజలకు చేసిన సేవలను గుర్తించి తనను వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

హనుమకొండ చౌరస్తా: అక్రమ కేసులు పెట్టి జైలు రిమాండ్ తర్వాత శుక్రవారం చంద్రబాబునాయుడు విడుదల కావడంతో విజయవా డలో తెలంగాణ టిడిపి నేతలు కలిసి పరామర్శించారు. చంద్రబాబుని కలి సిన వారిలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి పుల్లయ్య, పశ్చిమ నియోజక వర్గ ఇంచార్జి ఎండీ.రహీమ్, చంద్రబాబు యువసేన వ్యయస్థాపక అధ్య క్షులు చెన్నోజు రఘుబాబు, హరిదాస్యం సురేష్ లు ఉన్నారు.

చంద్రమౌళి సేవలు అమూల్యమైనవి

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని పీఎస్‌లో హెచ్ఎంగా పనిచేసిన రాయపురం చంద్రమౌళి సేవలు అమూల్యమైనవని మండల నోడల్ అధికారి గాయపు లింగారెడ్డి కొనియాడారు. ఇటీవల బదిలీ పై మరో పాఠశాలకు వెళ్లిన హెచ్ఎం రాయపురం చంద్రమౌళికి శనివారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రమేష్, ఎంపీటీసి బొట్ల మహేంద్ర, పీఎస్ హెచ్ఎం కతిజుల్ కుబ్రా, డీటీఎఫ్ బాధ్యులు కందగట్ల రమేష్, నాగేశ్వర్ రావు తదతరులు పాల్గొన్నారు.

పరకాలలో ఆటో డ్రైవర్ల ర్యాలీ, ధర్నా

నవతెలంగాణ-పరకాల



ఆర్టీసీలో అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంతో తమ కుటుంబాలు వీధినపడుతున్నాయని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటోడ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని స్థానిక బస్టాండ్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ఆటోలతో ఆటోడ్రైవర్లు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడాలి వద్ద ధర్నా చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు మహాలక్ష్మి పథ కం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలను నమ్ముకొని కుటుంబాలను పోషించుకున్న డ్రైవర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు ఆధారం చూపాలని డిమాండ్ చేశారు.

అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాధికగుప్తా

నవతెలంగాణ-హనుమకొండ



హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ఐఏఎస్ అధికారి రాధిక గుప్తా శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సమావేశమయ్యారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాను అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, డిఆర్డిఓ శ్రీనివాస్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందించారు. బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాధిక గుప్తాను పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలియజేశారు.

రోడ్‌పై మ్యాన్ హోల్స్ మూతలపై దొంగల కన్ను

- నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-హన్మకొండ చౌరస్తా

హనంకొండ గుడిబండల్ ప్రాంతంలోని ఇందిరానగర్ మూల మలుపు నుండి మొదలు పెట్టి వరుసగా ఉన్న మూడు మ్యాన్ హోల్స్ పై ఉన్న ఇనుప మూతలను దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు మ్యాన్‌హోల్స్‌వద్ద కర్రలు పెట్టి ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటన జరిగి ఆరు నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు, పాదాచారులు, స్కూల్ పిల్లలు అనునిత్యం ప్రయాణిస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే కానీ అధికారులు పట్టించుకోరా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రెండు,మూడునెలల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల హడావుడిలో నిమగ్నమై ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మ్యాన్ హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీ నుండి కాపాడాలని స్థానికులు, వాహనదారులు, పాదాచారులు కోరుతున్నారు. ఇక ముందు కూడా ఇలాంటి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గుడిబండల్‌లో ఉన్న మిర్చి దుకాణం, ఇందిరానగర్ మూలమలపు స్వీట్ హౌస్‌వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఇంకా గమనిస్తే మరిన్ని బయటపడే అవకాశాలు ఉన్నాయి. ఇవన్నీ మూల మలుపుల వద్దే ఉండడంతో ఏదో ఒకరోజు పెనుప్రమామాదమే పొంచిందని చెప్పాకతప్పదు. ప్రమాదం జరిగే వరకు చూడకుండా ముందే చర్యలు తీసుకొని ప్రమాదాల భారీ నుండి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఇంటి ముందు ఉన్న ఇనుప జాలీలను సైతం ఎత్తుకెళ్లిన సంఘటనలు ఉన్నాయని, పోలీసులు సైతం చిల్లర దొంగలపై నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్యానల్ స్పీకర్‌గా ఎమ్మెల్యే రేవూరి

నవతెలంగాణ-పరకాల



అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సభాపతి గడ్డం ప్రసాద్ శనివారం నలుగురిని ప్యానల్ స్పీకర్లుగా ప్రకటించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి పకాష్ రెడ్డిని పానెల్ స్పీకర్గా ప్రకటించడంతో స్పీకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ వర్గాల ప్రజలు రేవూరి ప్రకాష్ రెడ్డి పానెల్ స్పీకర్‌గా ఎన్నిక అవడం అభినందనీయమని కొనియాడారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-ఆత్మకూరు

మండలంలోని తిరుమలగిరి కేజీబీవీ 8వ తరగతి విద్యార్థిని కావ్య అండర్ 14 విభాగంలో మేడ్చెల్ జిల్లా నారాయణపేటలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకి ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ టేకుమల్ల వాసవి,వ్యాయమ ఉపాధ్యాయరాలు గజ్జెల సుమలత తెలిపారు. ఈ సందర్భంగా విద్యారిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పాముల సుబ్బయ్య సేవలు చిరస్మరణీయం

- సుబ్బయ్య కుటుంబానికి మంద కృష్ణమాదిగ పరామర్శ




నవతెలంగాణ-దామెర

మండలం పులుకుర్తిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎమ్మార్పీఎస్ జాతీయ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పాముల సుబ్బయ్యమాదిగ కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మూడు దశాబ్దాల పాటు అంతిమ లక్ష్యం కోసం ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ లక్ష్యసాధన కోసం క్రియాశీలక భూమిక పోషించాడని గుర్తుచేశారు. ఉద్యమంలో పాముల సుబ్బయ్య మాదిగ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బయ్య సతీమని నీలా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, అధికార ప్రతినిధి బొర్రాబిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి మాదిగ, సర్పంచ్ గోవిందు అశోక్, ఎంపీటీసీ గోవింద్ సంధ్య అశోక్, దామెర సర్పంచ్ గురజాల శ్రీరామ్‌రెడ్డి, మాదార పురతన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో వాయిస్, డబ్బింగ్ శిక్షణ తరగతులు

నవతెలంగాణ-హన్మకొండ



హనుమకొండ పట్టణంలో త్వరలో పివిఆర్ డబ్బింగ్ అకాడమీ ఆధ్వర్యంలో సినిమా, టీవీ రంగాలకు సంబంధించి వాయిస్ ఓవర్ (డబ్బింగ్) శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహ కులు పూసపాటి వినోద్‌కుమార్‌రాజు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా తెలంగాణ కోటి రతనాల వీణ, తెలంగాణ గడ్డ ఎన్నో చారిత్రాత్మకమైన ప్రదేశాలు, ఎన్నో కళలకు, సాంప్రదాయాలకు పుట్టినిల్లు అని స్వరమాంత్రికుడు 'పద్మశ్రీ' నేరెళ్ల వేణుమాధవ్‌ను ఆదర్శంగా తీసుకొని ఓరుగల్లులో కూడా వాయిస్‌రంగాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. గళ మాంత్రికులను తయారు చేసే ఉద్దేశంతో పీవీఆర్ డబ్బింగ్ అకాడమీ చేస్తున్న ఒకగొప్పప్రయత్నం. అనం తరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆసక్తిగలవారు 74162 22599, 7674092927 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో పూసపాటి వినోద్ కుమార్ రాజు, డాక్టర్ చిర్ర రాజు గౌడ్, మాడ సునిల్, బాలకృష్ణ పాలక్, అంజన్ కుమార్, శైలజ, పూస పాటి ఉమాదేవి, పంతుల సుధామాధురి తదితరులు పాల్గొన్నారు.

బడుగుల జీవుల బతుకుబండి సాగేదెలా ?



నవతెలంగాణ-హన్మకొండ

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి వారం గడవక ముందే నిరసన కార్యక్రమాల తాకిడి మొదలైంది. సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చే సిన వెంటనే ఆరు గ్యారంటీల్లో భాగంగా మొదటి గ్యారంటీ ఆర్టీసీ బస్సుల్లో మహిళ లకు ఉచిత ప్రయాణం మహాలక్ష్మి పథకాన్ని ఎంతో ఆర్బాటంగా ప్రారంభించారు. కానీ ఈ పథకం ఆటో డ్రైవర్లకు గుదిబండలామారింది. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 వేలకు పైగా, ట్రై సిటీలో 20 వేలకు పైగా ఆటోలపై ఆధారపడి జీవనం కొన సాగిస్తున్నారు. అయితే కొందరు స్వయంగా ఆటోలు ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసి నెలవాయిదాలు చెల్లి స్తూ జీవనం సాగిస్తున్నారు. మరికొందరు ఆటోలు కిరాయికి తీసుకొని తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆటోల్లోఎక్కువగా మహిళలే ప్రయాణం చేసేవారని ఇప్పుడు ప్రభుత్వం హఠాత్తుగా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రవేశ పెట్టడం ద్వారా మా జీవనోపాధికి గండి పడిందని వాపోతున్నారు. ఆటోలలో సాధారణ మహిళల కన్నా ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేటురంగసంస్థల్లో ఉద్యోగాలు చేసేవారే ప్ర యాణం చేసేవారని ఇప్పుడు మహాలక్ష్మి పథకం ద్వారా వారే లబ్ధి పొందుతున్నారని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నా రు.

మాకు ప్రభుత్వమే జీవనోపాధి కల్పించాలి...

- ప్రభుత్వం నిర్ణయంపై పోరుకు సిద్ధమవుతున్న ఆటోడ్రైవర్లు

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాకు వ్యతిరేకం కాదని దీనివల్ల మేము జీవనోపా ధిని కోల్పోతున్నామని పలువురు ఆటో డ్రైవర్లు ప్ర భుత్వాన్ని వేడుకుంటున్నారు. ఆటో డ్రైవర్లలో ఎక్కు వ మంది ఆటోలు కిరాయికి తీసుకొని నడుపుకుం టున్నామని చెప్పారు. రోజుకు రూ.300లు ఆటో ఓనర్లకు చెల్లించగా రోజుకు కనీసం రూ.1000లు మిగిలేవని ఇప్పుడు ఆటోఅద్దె చెల్లించిన తరువాత కేవలం రూ.300 నుండి రూ.500లు మిగులుతున్నాయని వీటితో మా ఇల్లు ఎలా గడిచేది ? పిల్లల ఫీజులు ఎలా చెల్లించాలి ? అని వాపోతున్నారు. కాబట్టి ప్రభుత్వమే మాకు వేరే ప్రత్యామ్నాయం జీవనోపాధిని చూపించాలని వేడుకుంటున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి :


జి.ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ ఆటో, ట్రక్ డ్రైవర్స్ యూనియన్



మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ పథకాన్ని మేము స్వాగతిస్తున్నాం. కానీ ఈ పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. అలాగే 2019 చట్టం ప్రకారం పెంచిన టాక్స్ లన్ని రద్దు చేయాలి. ప్రతి సం వత్సరం ప్రభుత్వం ప్రకటించిన రూ.12 వేలకు బదులు రూ.30వేలు తక్షణమే ప్రకటించి అమలు చేయాలి.

నెల తర్వాత మా కార్యాచరణ ప్రకటిస్తాం :

గుడిమల్ల రవికుమార్, టాడు అధ్యక్షులు



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా ఆటో డ్రైవర్లకు గిరాకీ తగ్గింది అనేది వాస్తవం కానీ ఆటో డ్రైవర్ల పరిస్థితిపై పూర్తిగా అవగాహన రావడానికి ఒక నెల రోజులు ఓపిక పడతామని డిసెంబర్ 31 తర్వాత పరిస్థితిని సమీక్షించి కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు.

కార్యచరణ రూపొందిస్తాం : వేల్పుల సాంబమూర్తి, న్యూ శాయంపేట



ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టడం మా పొట్ట కొట్టడమే గత వారం రోజులుగా మా ఆటో డ్రైవర్లు సరైన ఆదాయం రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి లేనిపక్షంలో వారం రోజుల్లో జిల్లా వ్యాప్తంగా మిగతా ఆటో డ్రైవర్ యూనియన్ లను సమీకరించి ప్రభుత్వం పై ఒత్తిడి తేవడానికి వారం రోజుల్లో మా కార్యచరణ రూపొందిస్తాం.

విద్యార్థులను టీవీలకు దూరంగా ఉంచాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై



నవతెలంగాణ-హనుమకొండ

పాఠశాల విద్యార్థులను తమ ఇళ్లల్లో టీవీ సీరియల్స్‌ను చూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ డిఇఓ డాక్టర్ అబ్దుల్ హై తల్లిదండ్రులకు సూచించారు. హనుమకొండ జిల్లాలో శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు.

ఈ సమావేశాల పరిశీలనకుగాను ఎస్ఐఇటి డైరెక్టర్ విజయలక్ష్మి, రాష్ట్ర పరిశీలకులు ఎంపీపీఎస్ పోచంపల్లి పాఠశాలను సందర్శించి ఉన్నతి పరిశీలనలో భాగంగా రాష్ట్ర పరిశీలకులు విజయలక్ష్మి ఏడవ తరగతిలో గణిత పాఠాన్ని పరిశీలించి పిల్లలు చాలా చక్కగా సమాధానాలు చెప్పడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయురాలి బోధనను ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇళ్లలో సాయంత్రం సీరియల్ చూడటం వల్ల పిల్లలు కూడా సీరియల్ చూస్తూ చదువుకు దూరం అవుతారని కనుక పిల్లల పట్ల శ్రద్ధ వహించాలంటేసీరియల్లకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాల చాలా బాగుందని మధ్యాహ్న భోజనంలో అప్పుడప్పుడు రాళ్ళు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాధ, క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివాగు ప్రాజెక్టు పరిధిలో యాసంగి సీజన్‌కు క్రాఫ్ హాలిడే

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని జోగంపల్లి శివారులోని మధ్యతరహా చలివాగు ప్రాజెక్టులో మరమ్మత్తుల నేపథ్యంలో యాసంగి సీజన్ కు తైబంది నీరు విడుదల చేయకుండా క్రాఫ్ హాలిడే ప్రకటిస్తున్నట్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. చలివాగు ప్రాజెక్టు శిఖంలో శనివారం దేవాదుల డిఈ గిరిధర్, ఏఈ అమత్, పెద్దకొడపాక, కొప్పుల గ్రామాల సర్పంచ్ లు అబ్బు ప్రకాష్ రెడ్డి, గోలి మాధురి మహేందర్రెడ్డి తోపాటు జోగంపల్లి, రాజక్కపల్లి, దామరాంచపల్లి, చెన్నాపూర్, రూపురెడ్డిపల్లి, దమ్మన్నపేట సర్పంచులు, ఆయకట్టు రైతుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. చలివాగు ప్రాజెక్టు తూము, చెరువు కట్ట, మత్తడి, ఎడమ, కుడి కాల్వల లైనింగ్ మరమ్మత్తు పనులకు నిధులు విడుదలై టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో, మరమ్మత్తు పనులను దష్టిలో పెట్టుకొని యాసంగి సీజన్ కు తైబందీ నీటిని విడుదల చేయకూడదని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ తీర్మానం కాపీని జిల్లా కలెక్టర్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు వివరించారు. క్రాఫ్ హాలిడే తో యాసంగి సీజన్లో రైతులకు నష్టం కలుగుతుందని, చలివాగు



మరమ్మత్తు చేసినట్లయితే భవిష్యత్తు తరాలకు ఉపయోగంగా ఉంటుందని ఉద్దేశంతో క్రాఫ్ హాలిడే ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.

జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో బహుమతులు



నవతెలంగాణ-హన్మకొండ

యూత్ ఫేస్ట్ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవి ఎయిడ్స్, టిబి, బ్లడ్ డొనేషన్ పట్ల అవగాహన పెంపొందించడంలో భాగంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ వారి ఆదేశాల మేరకు స్కూల్ విద్యార్థులకు జాతీయస్థాయి 9 రాష్ట్రాలతో హెచ్ఐవి ఎయిడ్స్ పై నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్లో హనుమకొండ గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులు పోటీపడి ప్రథమ బహుమతి సాధించి హనుమకొండ జిల్లా, తెలంగాణ రాష్ట్ర కీర్తి పతాకాన్ని జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ ఓ డాక్టర్ మదన్ మోహన్ రావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈవిద్యార్థులుగతంలో జిల్లాస్థాయిలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కాంపిటీషన్ ప్రోగ్రాంలో ప్రథమ స్థానంలో నిలవడం జరిగింది. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులు గండి సహస్ర, నలిమెల అక్షయకు రూ.50వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను న్యాకో అధికారిని సుచి గౌతమ్, చత్తీస్‌గడ్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జి జేరావు చేతుల మీదుగా అందజేశారు. రీజినల్ స్థాయిలో గుర్తింపు తెచ్చినందుకుగాను జిల్లా డాప్కోటీం స్వప్నమాధురి, కమలాకర్, రామకృష్ణ రమేష్‌లను, డీఎంహెచ్‌వో అభినందించారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు భాను

నవతెలంగాణ-హన్మకొండ



డిసెంబర్ 19, 20వ తేదీలలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి యోగా పోటీలకు వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన ఎస్.భాను ఎంపికైనట్లు ప్రముఖ యోగా గురువులు ఎ. సునీత, పోషాల శ్రీనివాస్ తెలియజేశారు. శనివారం భానును హరిత యోగ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాలలో సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ) మొదటి సంవత్సరం చదువుతున్న భాను నల్గొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనగా అక్కడ చక్కటి ప్రతిభను కనపరిచిన భాను జాతీయస్థాయి యోగాపోటీలకు ఎంపికైనట్లు తెలియజేశారు. బాను ఇంతకుముందు ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీలలో పాల్గొన్నాడని కూడా తెలియజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన భానుకి యోగా గురువులు సునీత, శ్రీనివాస్ పశ్చిమ బెంగాల్ కి వెళ్తున్న భానుకి సన్మానం చేయడం జరిగింది. అంతేగాక హరితయోగ శిబిర సాధకులు ఆర్థికంగా సహాయం చేసి శుభాకాంక్షలను చెప్పినట్లు యోగా గురువు శ్రీనివాస్ తెలియజేశారు.

మంత్రి భట్టి విక్రమార్కను కలిసిన నాయకులు



నవతెలంగాణ-నడికూడ

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వారి సతీమణి నందినిని ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభకాంక్షలు తెలిపిన నడికూడ మండల ముస్లిం మైనార్టీసెల్ అధ్యక్షుడు ఎండి.మహబూబ్ పాషా, పున్నంమహేష్, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



మంత్రి కొండా సురేఖకి శుభాకాంక్షలు తెలిపిన మాజీ వరంగల్ సిటీ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు తానం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు హైదరాబాదులో మంత్రి కొండా సురేఖ మర్యాదపూర్వకంగా తన నివాసంలో కలవడం జరిగింది. రామన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నవతెలంగాణ-వేలేరు



కేంద్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశానుసారం వేలేరు మండలంలోని వడ్డెటు-బండతండ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గ్రామీణ పేదలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై ఆడియో విజువల్ ప్రదర్శనను శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేలేరు మండల నోడల్ ఆఫీసర్, ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ ఎండి అక్తరున్నిసా,మండల వైద్య అధికారి నవీన్ మాట్లాడుతూ గ్రామీణ పేదలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై అవగాహన కోసం ఆడియో విజువల్ ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రజలకు భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు తెలియజేయాలని వారి అవగాహన కొరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాలోతు సంపత్, ఉప సర్పంచ్ భూక్య సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి రవీందర్, భాస్కర్, ఉపాధ్యాయులు వి.రవీందర్ రెడ్డి, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని అర్చన

నవతెలంగాణ-వేలేరు



వేలేరు మండలంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థిని ధోనికల అర్చన ఎస్‌జిఎఫ్ఐ ఆధ్వర్యంలో తొర్రూరులో ఈనెల 17,18 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి బేస్బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ కే స్రవంతి పిఈటి ఏ కిరణ్మయి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ఎస్ ఓ కే స్రవంతి, వ్యాయామ ఉపాధ్యాయుని కిరణ్మయి, పాఠశాల ఉపాధ్యాయ బందం విద్యార్థిని అభినందించారు.

ఆర్థిక స్వావలంబన దిశగా ప్రయాణించాలి

నవతెలంగాణ-ఆత్మకూర్



మహిళలు కుట్టు శిక్షణ పూర్తిచేసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని ఆత్మకూరు కెనరా బ్యాంక్ మేనేజర్, మదిన్ సిద్ధిక్ అన్నారు. శనివారం ఆత్మకూర్ మండల కేంద్రంలో ఎఫ్ఎం ఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన కుట్టు మిషన్ శిక్షణ ముగింపు శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ పొందిన పలువురు మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి టింగిలికారి సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి మేడ యాదగిరి, బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, నాగబండి శివప్రసాద్, మాధవి, రూపా దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు ఎమ్మెల్యేను సన్మానించిన ఎంపీటీసీ

నవతెలంగాణ-రఘునాథపల్లి



ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కురుమను ఆయన స్వగృహంలో శనివారం ఎంపీటీసీ పేర్ని ఉష రవి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవైసీఎస్ జిల్లా అధ్యక్షులు రవి కురుమ, నరేష్, పేర్నే లెనిన్, పాశం మధు, అజయ్, బొడ్డు జంగిల్, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు సురేఖ, ప్రభాకర్‌లను కలిసిన విక్రం గౌడ్

నవతెలంగాణ-కొడకండ్ల



రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, కొండ సురేఖలను రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బొమ్మగాని విక్రమ్ గౌడ్ శనివారం వేరువేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ బీసీ కుల గణన కొరకు అసెంబ్లీలో తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని వారిని కోరినట్లు విక్రమ్ గౌడ్ తెలిపారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరును ప్రకటించడమే కాక ట్యాంకు బండు పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని కోరారు. అనంతరం పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలను వేరువేరుగా పూల బొకేలు శాలువాలతో సన్మానించారు. విక్రం గౌడ్ వెంట పలువురు బీసీ నాయకులు ఉన్నారు.



రక్తదానం ఒక ప్రాణాన్ని కాపాడుతుంది

- లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం జనగామ

పూర్వ రీజియన్ చైర్మన్ ఏనుగు నర్సిరెడ్డి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

రక్తదానం వల్ల ఏలాంటి ఖర్చు ఉండదని, రక్తదానం ఎంతో విలువైందని, ఆపదలో ఉన్న ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుందని లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం జనగామ పూర్వ రీజియన్ చైర్మన్ ఏనుగు నర్సిరెడ్డి అన్నారు. శనివారం వీవర్స్ కాలనీలో అయ్యప్ప స్వాములు, లయస్ క్లబ్ ఆఫ్ జనగామ మిలినియం అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, కోడం శ్రీనివాసుల ఆధ్వర్యంలో షుగర్ వ్యాధి నిర్ధారణ, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏనుగు నర్సిరెడ్డి ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ పూర్వ చైర్మన్ శ్రీరామ్ శ్రీనివాస్, కాముని సమ్మయ్య, రచ్చ సత్యనారాయణ, వంగ యుగంధర్, బొంతపల్లి వెంకటేష్, రచ్చ శ్రీనివాస్, మచ్చ కుమార్, ఉమేష్, గాద నర్సింహులు, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు రత్నం తదితరులు పాల్గొన్నారు.

31న సోమనాథ కళా పీఠం పురస్కారాల ప్రధానం

నవతెలంగాణ-పాలకుర్తి



తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుని జన్మస్థలమైన జనగామ జిల్లా పాలకుర్తిలోని సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక 2021-22 ద్వైవార్షిక పురస్కార గ్రహీతల ఎంపిక ప్రక్రియ పూర్తి అయిందని, డిసెంబర్ 31న సోమనాథ కళాపీఠం ఆధ్వర్యంలో పురస్కారాలనుప్రధానం చేస్తున్నట్లు పీఠం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, ఇమ్మడి దామోదర్‌లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ డాక్టర్ సోమనాథ సాహిత్య కానుకుర్తి శెట్టి సోమశేఖర్, సోమనాథ సామాజిక శోధన పురస్కారంకు డాక్టర్ నలిమెల భాస్కర్, సోమనాథ రంగస్థల పురస్కారంకు మంచాల రమేశ్, పందిళ్ల శేఖర్ బాబు రాజయ్య శాస్త్రి స్వచ్ఛంద భాషా సేవ పురస్కారంకు డాక్టర్ మైథిలి అబ్బురాజు, వీరమనేని చలపతిరావు సాహిత్య పురస్కారంకు ఎంఎస్ఆర్ వెంకటరమణ, ముశం దామోదర్ రావు, ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారంకు డాక్టర్ సిఎస్ఆర్ ప్రభు, డాక్టర్ రాపోలు సోమయ్య, ప్రతిభా పురస్కారంకు డాక్టర్ అరూరి మహేందర్, దేవగిరి రాజయ్య స్మారక బిరుదుకు బూస రేణుకారాధ్య ఎంపికయ్యారని వివరించారు. ఈ కార్యక్రమానికి రాపోలు ఆనంద భాస్కర్, డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, డాక్టర్ టి.శ్రీరంగస్వామి, మార్గం లక్ష్మినారాయణలు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. డిసెంబర్ 31 పాలకుర్తిలో పురస్కార ప్రధానోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు.



ఉన్నతి, ప్రాథమిక ఆభ్యాసంపై పర్యవేక్షణ

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పడమటికేశవపూర్, ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర పరిశీలక బృందం సభ్యులు ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర కోర్డినేటర్ మంగ తాయారు, రమేష్, కొమురయ్యలు సందర్శించారు. ఉన్నతి, ఫండమెంటల్ లర్నింగ్ న్యూమరసీ మీద విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు, విద్యార్థినీ, విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. వీరితోపాటు మండల నోడల్ అధికారి డివిఎల్ మూర్తి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చలపతి రెడ్డి, రజిత జ్యోతి ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



మొక్కులు చెల్లించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పాలకుర్తి

పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్విని రెడ్డి అధిక మెజారిటీతో విజయం సాధించడంతో మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బీర్రు సోమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ యూత్ విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గోనే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సోమేశ్వర్, మహేందర్ రెడ్డిలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా యశస్వినిరెడ్డి విజయం సాధిస్తే తిరుమల తిరుపతి వెంకటేశ్వరుని కొండను కాలినడకనవచ్చి దర్శించుకుంటామని మొక్కుకున్నామని తెలిపారు. శనివారం ఆ మొక్కులు చెల్లించుకున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో రాజకీయ ఉద్దండుడు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై యశస్విని రెడ్డి అధిక మెజారిటీతో విజయం సాధించి చరిత్ర సృష్టించిందని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోనె అశోక్ రెడ్డి, అనుముల రమేష్, అనుముల కుమార్, గాదరి కుమార్, పొన్నాల దామోదర్ రెడ్డిలు తిరుమల కొండను కాలినడకన వెళ్లి వెంకటేశ్వరుని దర్శనం చేసుకున్నారు.

గ్యాస్ ఈ-కేవైసీ కొరకు ఆందోళన చెందవద్దు

- భారత్ గ్యాస్ కంపెనీ యజమాని కే.నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

గృహ వినియోగానికి ఉపయోగించే గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులు ఈ కేవైసీ చేయించుటకు ఆందోళన చెందవద్దని తొర్రూర్ భారత్ గ్యాస్ కంపెనీ యజమాని కుందూరు నిరంజన్ రెడ్డి తెలిపారు. గ్యాస్ వినియోగదారులు తమ కనెక్షన్ కొనసాగుటకు ఈ కేవైసీ నిరంతరంగా కొనసాగే ప్రక్రియ అని తెలిపారు. కంపెనీకి సంబంధించిన ప్రతినిధులు గ్రామాల్లోకి వచ్చి ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తారని వారు తెలిపారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ కంపెనీకి ఈ కేవైసీ కొరకు ఎవరు కూడా రావద్దని వారు కోరారు.

ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



ఓటరు జాబితా తయారీలో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకమైందని జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో స్పెషల్స్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా నూతన ఓటరునమోదు, మార్పులు, చేర్పులు (బీఎల్‌ఓ) బూతు స్థాయి అధికారుల విధులు తదితర అంశాలపై ఈ శిక్షణ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం,తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారి ఓటర్‌గా నమోదు చేయడానికి, మార్పులు చేర్పుల గురించి ఏఏ ఫారాలు నింపాలి, గృహ సందర్శన సమయంలో ఓటర్ నమోదుకు తీసుకోవాల్సిన ధృవపత్రాలు, తొలగించడానికి ఏ ఫారం వినియోగించాలి తొలగించాలంటే ఏ ఏ ధ్రువపత్రాలు అవసరం మార్పులు చేర్పులుకు ఏ ఫారం వాడాలి అనే దానిమీద శిక్షణను ఇచ్చారు.బూత్‌స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో ఎన్నికల కమిషన్ ప్రతినిధిగా వ్యవహరిస్తారని, ఈ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ ప్రాంతానికి సంబంధించిన ఫీల్డ్‌లో ఉన్న వాస్తవిక సమాచార సేకరణ, పౌరుల నుండి రిజిస్ట్రేషన్ ఫారాలు సేకరణ రివిజన్ ప్రాసెసింగ్ వంటి కార్యక్రమాలు చేస్తారని చెప్పారు. ఓటరు జాబితాకు సంబంధించిన విషయాల్లో స్థానిక ప్రజలకు బూతు లెవల్ అధికారి స్నేహితుడిగా వ్యవహరిస్తారన్నారు.సమాచార సేకరణ, ఫీల్డ్ వెరిఫికేషన్, అర్హులైన ఓటర్లు, చనిపోయిన ఓటర్లను గుర్తించడం, అక్కడికి కొత్తగా నివాసానికి వచ్చిన ఓటర్లు అందరి సమాచారాన్ని మరి ఎన్నికల సంఘం మొత్తం పర్యవేక్షణ బూతులు అధికారి రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌తో కలిసి బాధ్యత వహిస్తారన్నారు. బిఎల్‌ఓ యాప్ ద్వారా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో ట్రైనింగ్ నోడల్ అధికారి, జెడ్పి సీఈఓ అనిల్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు సురేందర్ రెడ్డి, కోటయ్య, రామరాజు, జితేందర్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ శీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా రోడ్ల ఆక్రమణ

పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఫుట్ పాత్‌లు, డ్రైనేజీల పైనే వ్యాపారం





నవతెలంగాణ-పాలకుర్తి

రోడ్ల విస్తరణతో పాలకుర్తి రూపురేఖలను మార్చి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేశారు. పాలకుర్తి మండలంలో నాలుగు వైపులా కిలోమీటర్ దూరం వరకు నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణాలతో పాటు అండర్ డ్రైనేజీ పనులను పూర్తి చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అండర్ డ్రైనేజీతో పాటు ఫుట్‌పాత్ పనులు పూర్తి చేశారు. నాలుగు వైపులా 110 ఫీట్లతో రోడ్డు ఇరువైపులా విస్తరణ పనులు చేపట్టారు. అండర్ డ్రైనేజీ లోపల వ్యాపారం చేసుకోవాలని ఆంక్షలు ఉన్నప్పటికీ, వ్యాపారస్తులు యథేచ్ఛగా రోడ్లను ఆక్రమించుకుంటూ డ్రైనేజీతో పాటు ఫుట్ పాత్‌లపై వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

వ్యాపారస్తులు ఆక్రమించుకున్నప్పటికీ పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్ల విస్తరణ ఆక్రమణకే గురవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. డ్రైనేజీల పై మెట్ల నిర్మాణాలతో పాటు ఫుట్‌పాత్‌ల పైన రేకులు వేయడం, ఆక్రమించుకోవడం, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతుంది. డ్రైనేజీలు దాటి రోడ్లపైనే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు ఏలాంటి చర్యలు చేపట్టకుండానే అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కోట్ల రూపాయలను వెచ్చించి రోడ్ల విస్తరణకు శ్రీకారం చుట్టగా, వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించుకోవడం వల్ల వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్ల విస్తరణ ఇరుకుగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉండగా, వ్యాపారస్తులు ఆక్రమించుకోవడంతో వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయడంతో పోలీసులు వేసే ఫైన్‌లకు వాహనదారులు లబోదిబోమంటున్నారు.

వేలకు వేలు ఫైన్‌లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుచున్నారు.

చర్యలు తీసుకుంటాం : పంచాయతీ కార్యదర్శి వెంకటాచారి

పాలకుర్తిలో డ్రైనేజీలతో పాటు ఫుట్‌పాత్, రోడ్లను ఆక్రమించుకున్న వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటాం. ఒకటి రెండు రోజుల్లో రోడ్లపై వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తులందరికీ నోటీసులు జారీ చేస్తాం. నోటీసులకు స్పందించకుంటే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలతో పాటు వ్యాపారాలను తొలగిస్తాం. డ్రైనేజీలపై, ఫుట్‌పాత్‌లపై, రోడ్లపై వ్యాపారాలు చేసుకునేందుకు ఏలాంటి అనుమతులు ఇవ్వలేదు. రోడ్లపై అక్రమంగా వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తులు గ్రామపంచాయతీకి సహకరించాలని సూచించారు.

పీఎస్‌బీ వాడకంతో అధిక దిగుబడులు

- వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు పరశురాం నాయక్

నవతెలంగాణ-పాలకుర్తి



భూమిలో దాగివున్న భాస్వరాన్ని కలిగించే బ్యాక్టీరియా పిఎస్బిని పంట పొలాల్లో వాడడం వల్ల పంటలు అధిక దిగుబడులు వస్తాయని పాలకుర్తి డివిజన్ వ్యవసాయ శాఖ ఉపాసంచాలకులు అజ్మీర పరశురాం నాయక్ రైతులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో, రైతులు, ఎరువుల దుకాణాల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాలకుర్తి వ్యవసాయ శాఖ అధికారి ఏ. రాజుతో కలిసి పరశురాం నాయక్ మాట్లాడుతూ పిఎస్‌బిని విత్తన శుద్ధితో పాటు నారు వేళ్లను తడుపు పద్ధతిలో వాడుకోవచ్చుని తెలిపారు. నేరుగా భూమిలో పడే పద్ధతిలో డ్రిప్పుతో పాటు స్ప్రే చేసుకోవాలని సూచించారు. పిఎస్‌బి వాడడం వలన 20 నుండి 22 శాతం భాస్వరం, ఎరువులు వాడకాన్ని తగ్గించుకోవచ్చుని తెలిపారు. పిఎస్బి వాడకం వలన నేలను గుల్లపరచడంతో పాటు వేరు వ్యవస్థ విస్తరిస్తుందని, జింకు ఇతర పోషకాలను మొక్కకు అందిస్తుందని తెలిపారు.

భూముల్లో చౌడు రాకుండా నివారిస్తుందని, ప్రతీ రైతు పిఎస్బిని వాడే విధంగా దృష్టి పెట్టాలని డీలర్లను సూచించారు. భూమి సంరక్షణతో పాటు అధిక దిగుబడులకు పిఎస్బి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.



విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

- ఎంపీపీ చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ-లింగాలఘణపురం

విద్యార్థినీ, విద్యార్థులు ఇష్టంతో కష్టపడి విద్యాభ్యాసన చేయాలని ఎంపీపీ చిట్ల జయ శ్రీ ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలం గుమ్మడివెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రత్నాదేవి అధ్యక్షతన నిర్వహించబడిన పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా జనగామ జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షురాలు, ఎంపీపీ చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి, డీఈవో కే.రాము పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడివెల్లి గ్రామ సర్పంచ్ శ్రీపాల్ రెడ్డి నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, కాంప్లెక్స్ హెచ్ఎం మల్లిఖార్జున్,ఎస్ఎంసీ చైర్మన్ బుగులయ్య, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ అనురాధ, దాత వెంకటయ్య, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, డిఈఓ రాములు, విద్యా కమిటీ చైర్మన్‌లుస్వామి, శ్రీనివాస్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలో చెన్నూరు విద్యార్థి ప్రతిభ

- మొదటి బహుమతి సాధించిన సోమేశ్వర్

నవతెలంగాణ-పాలకుర్తి

జిల్లా స్థాయి రన్నింగ్ పోటీలో మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన వి.సోమేశ్వర్ మొదటి బహుమతి సాధించి ప్రతిభను కనబరిచారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జనగామలో దివ్యాంగులకు జిల్లా స్థాయి రన్నింగ్ పోటీలను నిర్వహించారు. రన్నింగ్‌లో సోమేశ్వర్ ప్రతిభను కనబరిచి మొదటి బహుమతి సాధించడంతో జిల్లా అధికారులు సోమేశ్వర్‌కు ప్రశంస పత్రం తోపాటు మెమొంటోను అందజేశారు. జిల్లాస్థాయిలో సోమేశ్వర్ విజయం సాధించి చెన్నూరు గ్రామాన్ని అగ్రభాగాన నిలిపాడని, గ్రామస్తులు, దివ్యాంగులు సోమేశ్వర్‌ను అభినందించారు.



నాణ్యమైన విద్యను అందించాలి

- రాష్ట్ర విద్యాశాఖ

డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్

నవతెలంగాణ-మరిపెడ

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. శనివారం మరిపెడ మండలంలోని ఎల్లంపేట హై హైస్కూల్‌ను అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీనెల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వామ్యం, విద్యార్థుల యొక్క నైపుణ్యాలను, చదువు పట్ల శ్రద్ధ తీసుకొని మంచి గ్రేడింగ్ సాధించే విధంగా వారిని తీర్చిదిద్దాలన్నారు. గ్రామీణ విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు, సమాజం పట్ల జరిగే అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పూల్ చందు, ఎల్లంపేట హై స్కూల్ హెడ్మాస్టర్ బి.భాస్కర్ రావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరహరి, ఎస్ఎంసి చైర్మన్ దేవేందర్, పాఠశాల సిఆర్‌పి సత్యశ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాంపూర్ విద్యార్థులకు టై బెల్ట్ అందచేత

రాంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము చంద్రశేఖర్ కుమారుడు కొమ్ము లోకేష్ ప్రభుత్వ ఉద్యోగం సాధించగా హై స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందజేశారు. ఈ పాఠశాలలో చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ము చంద్రశేఖర్,కొమ్ము లోకేష్, స్కూల్ చైర్మన్ ఎల్ది అశోక్, హై స్కూల్ హెడ్ మాస్టర్ శశిధర్, ఉపాధ్యాయులు, చిర్ర మధుసూదన్, చరణ్, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-మహబూబాబాద్

కుటుంబ సమస్య నేపథ్యంలో మహబూబాబాద్ మున్సిపాలిటీలో డ్రైవర్‌గా పని చేస్తున్న అలవత్ సుధాకర్ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన శనివారం నెలకొంది. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డుకు చెందిన సుధాకర్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబ ఇంటి వద్ద క్రిమిసంహారక మందు సేవించగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మానుకోటలోని ధరణి ఆసుపత్రికి తరలించారు. సుధాకర్ పరిస్థితి విషమంగానే ఉంది. చైర్మన్ డాక్టర్ పాల్వాయ్ రామ్మోహన్ రెడ్డి, నాయకులు కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, యాళ్ల మురళీధర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, దౌలాగర్ శంకర్, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీహరి తదితరులు పరామర్శించారు.





బీజేపికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి

- **ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్**

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

విద్యార్థి వ్యతిరేక విధానాలకు, విద్య కాషాయికరణకు తెగపడుతున్న బీజేపికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ పిలుపు నిచ్చారు. ముంబైలోని భూపేష్ గుప్త భవన్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జాతీయ సమితి సమావేశాలకు ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై, ఏఐఎస్ఎఫ్ భవిష్యత్ విద్యార్థి ఉద్యమంపై చర్చించడం జరిగిందని, బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం-2020 పూర్తిగా విద్యా విధానాన్ని నిర్వీర్యం చేసే విధంగా, విద్య కాషాయికరణ చేసే విధంగా ఉందని, తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు విద్యా సంస్థలను కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం కక్ష్యపూరితంగా వ్యవహరిస్తుందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యార్థి సంఘాల అధ్వర్యంలో 2024 జనవరి 12న చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎన్ఎ స్టాలిన్ తెలిపారు.



పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- **ఏఎంఓ ఆజాద్ చంద్రశేఖర్**

నవతెలంగాణ-గూడూరు

పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని ఎంపియుపిఎస్ భూపతిపేట పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశంలో చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి పిల్లల ప్రగతి పై చర్చించాలన్నారు. విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచడానికి ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతీ విద్యార్థి పైన ప్రత్యేక శ్రద్ధ చూపించడం జరుగుతుందని, తల్లిదండ్రుల నుండి ఏమైనా సలహాలు సూచనలు ఉంటే వాటిని కూడా స్వీకరించి ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, నీరజ, రమేష్, శ్రీమతి చైతన్య శ్రీధర్, తల్లిదండ్రులు వెంకన్న, శ్రీనివాస్, సంపత్, రవి, సంధ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.



ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- **న్యాయవాది వాసం ఆనంద్ కుమార్**

నవతెలంగాణ-గూడూరు

విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులు కన్న కలలు నెరవేర్చాలని న్యాయవాది ఆనంద్ కుమార్ అన్నారు. శనివారం గూడూరు మండలంలోని మట్టెవాడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కొమరం భీం యూత్ ఆధ్వర్యంలో అట్లాస్, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయవాది వాసం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీ మట్టేవాడ గ్రామంలో 1952 పాఠశాల నిర్మించబడిందని, అప్పటినుంచి వేల మంది ఉద్యార్థులు ఇందులో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నారని, ఈ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని, ఈ విద్య ద్వారానే సమసమాజం, అసమానతలు తొలగిపోతాయని ప్రతీ విద్యార్థి చదువుకొని గొప్ప స్థాయిలో నిలవాలన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు లక్షల రూపాయలు కట్టి చదువులు కొనసాగించే పరిస్థితి లేదని ప్రతీ విద్యార్థి చదువుకు దూరం కాకుండా ప్రభుత్వ పాఠశాలలను ఉపయోగించుకొని కార్పొరేట్‌కి ధీటుగా విద్యని అభ్యసిస్తూ ఆయా రంగాలలో ముందంజలో ఉండాలన్నారు. అందుకుగాను గ్రామ ప్రజలు, చదువుకున్న మేధావులు, నాయకులు ప్రతీ ఒక్కరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు కొనసాగేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈసం సంధ్య సూర్యనారాయణ, గ్రామ పటేల్ రేగ వెంకటేశ్వర్లు, గ్రామ దొర బిజ్జా పొట్టయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు వాసం వీరస్వామి, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పెనుక శ్యామల, ఉపాధ్యాయులు దారం శ్రీనివాస్, రేగ వెంకన్న, రాజు, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు లింగాల కిరణ్, కొమురం భీం యూత్ అధ్యక్షులు ఈసం రమేష్, నరేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాదని మనస్తాపంతో నిరుద్యోగి ఆత్మహత్య

- **కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు**



నవతెలంగాణ-గార్ల

ఉద్యోగం రాదేమోనని మనస్తాపంతో నిరుద్యోగ యువకుడు ఆత్మహత్య చేసుకుని మరణించిన విషాద సంఘటన మండలంలోని రాజు తండ పంచాయతీ ఎర్ర మట్టి తండాలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం భూక్య వినయ్ కుమార్ (23) అనే నిరుద్యోగ యువకుడు డిగ్రీ చదివి పలు ఉద్యోగ నోటిఫికేషన్‌లకు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పరీక్షలు వాయిదా పడుతుండంతో కోచింగ్ సెంటర్‌ల నుండి సొంత గ్రామం ఎర్ర మట్టి తండాలోని ఇంటికి వచ్చి గత కొంతకాలంగా ఇంటి వద్దనే ఉంటూ తల్లితో కలిసి కూలీ పనులకు వెళ్తున్నాడు. ధరఖాస్తులు చేసుకున్న ఉద్యోగ నోటిపికేషన్‌లు పేపర్ లీకేజ్‌లు కావడం, పలు పరీక్షలు వాయిదా పడటంతో చాలా రోజుల నుండి ఉద్యోగం రాదని మనస్థాపనతో తోటి బంధువులకు, స్నేహితులకు చెప్తుంటున్నాడని పలు మార్లు చెప్పుతూ పేదరికంలో ఉన్న నేను కోచింగ్ సెంటర్‌లలో డబ్బులు కట్టి చదివిన ఉద్యోగం రాదనే మనస్తాపంతో సూసైడ్ నోట్ రాసుకుని గత రాత్రి పురుగుల మందు సేవించి డోర్నకల్ సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధిస్తాడుకున్న కొడుకు ఉద్యోగం రాదేమోనని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన కుమారుడు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. నిరుద్యోగ యువకుడు ఆత్మహత్య చేసుకుని మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఉద్యోగం రాదేమోనని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకోని మరణించిన నిరుద్యోగి వినయ్ కుటుంబానికి యాభై లక్షల రూపాయలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేళోత్ సాయికుమార్, సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్‌లు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ విప్ రావడం పట్ల హర్షం

నవతెలంగాణ-మరిపెడ



డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్ ప్రభుత్వ విప్‌గా ఎన్నిక కావడం పట్ల కాంగ్రెస్ నాయకులు జరుపుల వినయ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం రామచంద్రనాయక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు జరుపుల వినయ్ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విప్‌గా డాక్టర్ రామచంద్రనాయక్‌ను నియమించడంతో సంతోషం వ్యక్తం చేశారు.తనపై ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన నియోజవర్గ ప్రజలకి తప్పకుండా న్యాయం చేస్తాడని ఈ సందర్భంగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన నాయకులు నవీన్, సోమ, మహేష్, జే.జితేందర్, నరేష్, జే.రవి, లక్ష్మణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై అధికారుల నిర్లక్ష్యం..?





గ్రామ ఆడిట్ సభలో కూలీల ఆవేదన...!

నవతెలంగాణ-మరిపెడ

మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి పనులపై మండల అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్లు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 52 రకాల పనులు కల్పించవలసి ఉండగా కేవలం రెండు మూడు పనులతో నామాత్రంగా పనులు కల్పించారాని, పనులపై అవగాహన కల్పించలేక పోయారని పలువురు ఉపాధి కూలీలు సోషల్ ఆడిట్ సభలో అధికారులను నిలదీశారు.

శనివారం మండలంలోని తాళ్ల ఊకల్, చిల్లంచర్ల, తానంచర్ల, గ్రామాలలో 13వ విడత గ్రామ సోషల్ ఆడిట్ గ్రామసభలు సర్పంచులు అధ్యక్షతన నిర్వహించారు. 2020 డిసెంబర్ నుండి 2023 డిసెంబర్ వరకు మూడు సంవత్సరాలపనుల వివరాలను అయా గ్రామ సభలో ప్రవేశపెట్టారు. తాళ్లఊకలు గ్రామంలో నిర్మించిన క్రీడా ప్రాంగణం ఊరికి రెండు కిలోమీటర్ల దూరం ఉందని, అది కూడా బండపై నిర్మించినట్లు ఎందుకు ఉపయోగపడదని గ్రామస్తులు ఆరోపించారు. దానిపై మట్టిపోసి బిల్లులు డ్రా చేశారని యువకులు ఆరోపించారు. అన్ని గ్రామాలలో నర్సరీ మొక్కలలో అవినీతి జరిగిందని ఉపాధి కూలీలు పేర్కొన్నారు. మొక్కల పేరుతో సర్పంచులు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీళ్ల పెట్టినట్లు డీజిల్ పోసినట్లు బిల్లులు చూపుతున్నారని. తనిఖీ అధికారులు నర్సరీ మొక్కలను పరిశీలించగా కనీసం 50 శాతం కూడా మొక్కలు లేవని తేలిందని ఆడిట్ అధికారులు సభలో ప్రజలకు వివరించారు. స్థానిక సర్పంచులు ఫేక్ మాస్టర్లతో కుటుంబ సభ్యులు పేర్లతో డబ్బులు డ్రా చేస్తున్నట్లు గ్రామాల నివేదికల ద్వారా నిర్ధారణ అవుతుందన్నారు. తానంచర్లలో చలమల్ల సత్తెమ్మ ఉపాధి పనికి వెళ్లగా ఆమేకు నాలుగు వేల రూపాయలు రాలేదని సోషల్ ఆడిట్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు డిఆర్పి యాకలక్ష్మి తెలిపింది. చనిపోయిన పాతూరి సత్తెమ్మ పేరుతో డబ్బులు జమ అయినట్లు ఆమె తెలిపారు. ఆధార్ కార్డు లింక్ కాకపోవడం వల్ల ఒకే పేరుతో ఉన్న ఆమె ఖాతాలో డబ్బులు జమైనట్లు పేర్కొన్నారు. ఊకాల్, చిల్లంచర్ల గ్రామాలలో మట్టి రోడ్లు వేయకుండానే బిల్లులు డ్రా చేశారని, అదే రోడ్లపై ఫేక్ వర్క్ ఐడి పేరుతో సీసీ రోడ్డు బిల్లులు ఎత్తుతున్నారని ఉపాధి కూలీలు శ్రీనివాసు, ఆకుల నరేష్, నరేందర్, తదితరులు అధికారులకు ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి పనులను అధికారులు కల్పించలేకపోతున్నారని ఆయా గ్రామసభలకు హాజరైన ఉపాధి కూలీలు ఆరోపిస్తున్నారు.

మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో లోపించిందని ఫేక్ వర్క్ ఐడీలతో మాస్టర్ పై సంతకాలు పెట్టి డబ్బులు డ్రా చేస్తున్నట్టు పలువురు యువకులు విమర్శించారు. మాస్టర్‌లో కూలీల సంతకాలు లేకున్నా డబ్బులు జమ అయినట్లు పేర్కొన్నారు. ఉపాధి పనులలో 52 రకాల పనులు చేయించవలసి ఉండగా కేవలం రెండు మూడు రకాల పనుల కూలీలకు చూపుతున్నట్లు సోషల్ ఆడిట్ అధికారుల ముందు వివరించారు. ఈ సోషల్ ఆడిట్ గ్రామసభకు సర్పంచులు దిగిచర్ల శ్వేతా ముఖేష్, బోలగాని నర్మద, నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, నరేష్, మౌనిక, కళ్యాణ్, డీఆర్పీలు ఏకలక్ష్మి, ప్రశాంత్, మౌనిక, టెక్నికల్ అసిస్టెంట్లు నరేష్, సురేష్, సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్లు సీత వెంకన్న, ఉప్పలయ్య, వార్డు సభ్యులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



నూతనంగా నియమించబడిన జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పర్మర్ పింకేశ్ కుమార్ లలిత్ కుమార్ శనివారం కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ సిహెచ్ శివలింగయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన నూతన అదన కలెక్టర్‌ను ప్రత్యేక కలెక్టర్ సుహాసిని, డిఆర్డిఓ పిడి మొగులప్ప, జెడ్పీ సీఈవో అనిల్ కుమార్, డిఈఓ రాము, సీపీఓ ఇస్మాయిల్, డిఎఓ వినోద్ డిపిఆర్ఓ రాజేంద్ర ప్రసాద్, ఏపిడీ నూరుద్దీన్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

నవతెలంగాణ-కొడకండ్ల



పాకాల గ్రామానికి చెందిన కడప కొండ సోమిరెడ్డి బైక్ పై నుండి పడి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కేటీఆర్‌వి అన్నీ బోల్లదోపు మాటలే

- **కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి**

నవతెలంగాణ-బయ్యారం



కేటీఆర్ వన్నీ బోల్లదోపు మాటలే అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శనివారం గవర్నర్ ఉపన్యాసానికి ధన్యవాదాలు చెప్పే క్రమంలో అసెంబ్లీలో కేటీఆర్ మాటలను తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పై కేటీఆర్ ఆరోపణలు అర్ధరహితం అని అన్నారు. పదేళ్ల నిరంకుశత్వానికి చమరగీతం పాడిన రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గౌరవించే స్థితిలో కేటీఆర్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ వైఫల్యాన్ని ఎండగడుతుంటే తట్టుకోలేక కేటీఆర్ మాట్లాడిన మాటలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి గొడ్డలిపెట్టు అని వ్యాఖ్యానించారు.అధికారం పోవడంతో సోయితప్పి ఏం మాట్లాడాలో బీఆర్ఎస్ సభ్యులకు పాలుపోవడం లేదని ఎద్దేవా చేశారు. పదేళ్ల తమ పాలనలో జరిగిన ప్రజా హక్కుల విధ్వంసాన్ని, చేసిన మోసాలకు, మేసిన వేల కోట్ల రూపాయలకు సమాధానం చెప్పాల్సిన భాద్యత బీఆర్ఎస్ పార్టీదని హెచ్చరించారు. నోరుంది కదా అని పిచ్చిపట్టినట్టు అరిస్తే చేసిన పాపాలు పోవని అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలు గ్రహించి స్పృహలోకి రావాలన్నారు. ఆరు గ్యారంటీల పై కూడా కేటీఆర్ వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నాయని ఆక్షేపించారు. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగి ఇల్లందు బంగారు కొండ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్



- **రెండున్నర తులాల బంగారం స్వాధీనం**
- **30 కేసుల్లో నిందితుడిగా గుర్తింపు**

నవతెలంగాణ-హసన్‌పర్తి

హసన్‌పర్తి పోలీసు స్టేషన్ పరిధి బావుపేట క్రాసు రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రాజుకుమార్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది 30 కేసులలో నిందితుడైన అంతర్ జిల్లా నేరస్తుడిని అరెస్టు చేసి అతని వద్ద రెండున్నర తులాల బంగారు చంద్రహారం స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి వెల్లడించారు. ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి కథనం ప్రకారం..భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గణేష్ టెపుల్, కూలీ లైన్ కాలనీ ప్రాంతానికి చెందిన షేక్ ఇర్ఫాన్ 2013 సంవత్సరం నుంచి పలు దొంగతనాల కేసులో నిందితుడు. కొన్ని నెలల క్రితం ఇతటిపై పీడీయాక్టు నమోదు చేసి జైలు జీవితాన్ని అనుభవించాడు. ఇటీవలే జైలు నుంచి విడుదలైన ఇర్ఫాన్ తన ప్రవృత్తిని మార్చుకోకుండా తిరిగి దొంగతనాలకు పాల్పడుతూ జల్సా జీవితాన్ని అనుభవిస్తున్నాడు. ఇతను ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం పరిసర ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే తన స్నేహితుడు మతిన్‌తో కలిసి ఇర్ఫాన్ ఇల్లందు పోలీసు స్టేషన్ పరిధిలో రెండు ఇండ్లలో చోరీ చేసి రూ.9వేలు, ఒక చంద్రహారం దొంగిలించాడు. అంతేకాకుండా మరొక ఇంటిలో అక్టోబర్ నెలలో ఆరు తులాల బంగారం, 15 తులాల వెండి దొంగతనం చేసి కొత్తగూడెం జిల్లా పరిధిలోని గుర్తుతెలియని వ్యక్తికి అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఇదే విధంగా కొత్తగూడెం జిల్లాలో చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 దొంగతనాలు చేయడం జరిగింది. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2.5 తులాల బంగారం కమ్మలు, చైను, 20 తులాల వెండి, రూ.20 వేల నగదును దొంగతనం చేసి మతిన్ అనే నేరస్తుడు పోలీసులకు పట్టుబడి ప్రస్తుతం అతను కారాగారంలో ఉన్నాడు. అనంతరం వీరిద్దరి మధ్య దొంగిలించిన సొత్తు గురించి గోడవపడి విడిపోయారు. అనంతరం ఇతను హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఆటో దొంగతనం చేయడానికి ప్రయత్నించిన కేసులో ఇతను నిందితునిగా ఉన్నాడు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం బావుపేట క్రాస్ రోడ్ వద్ద ఎస్సై రాజకుమార్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా నేరస్తుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడి జేబులో ఉన్న రెండున్నర తులాల బంగారు చంద్రహారంను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి వెల్లడించారు. పోలీసు విచారణలో ఇర్ఫాన్ 30 కేసులలో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు.

సెంట్రల్ జోన్ డీసీపీ ఎండీ బారీ, క్రైం డీసీపీ మురళీధర్, కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ గారి ఆదేశాల మేరకు నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన హసన్‌పర్తి ఇన్స్పెక్టర్ తుమ్మ గోపి, క్రైమ్ కానిస్టేబుల్ వి.క్రాంతికుమార్, నాగరాజు, మధు, సోమన్న, గీతలను నగర పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అభినందించారు.

పురుగుల మందు సేవించి వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-బయ్యారం

మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన ఇనుగుర్తి రోహిణి (26) వివాహిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఇనుగుర్తి రోహిణి అను మహిళ 2018లో వారి గ్రామానికే చెందిన హరీష్ అను వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ఒక పాప. గత కొద్ది రోజులుగా తన భర్త మద్యం తాగి, మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవట్లేదనే బాధలో ఉంటుందని, ఈ నెల 13న రాత్రి భర్త తాగి వచ్చి గొడవ పడడంతో మనస్తాపం చెంది 14న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించగా వెంటనే కుటుంబ సభ్యులు గమనించి మహబూబాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో ఈ నెల 15న మధ్యాహ్నం మరణించినట్లు, మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేందర్ తెలిపారు.

రాజీ మార్గమే సరైనది

- **జిల్లా ప్రిన్సిపల్ జడ్జి చంద్రశేఖర ప్రసాద్**

నవతెలంగాణ-మహబూబాబాద్

కేసుల పరిష్కారంలో రాజీమార్గమే సరైందని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి చంద్రశేఖర ప్రసాద్ తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేస్తూ ప్రజల ప్రశాంత జీవనం కోసం ఈనెల 30న జిల్లా న్యాయస్థానం ఆవరణలో లోక్ అదాలత్‌లో వివిధ కేసుల్లో ఉన్న కక్షిదారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈ లోక్ ఆదాలత్ కార్యక్రమంలో కేసులకు సంబంధించిన ఇరువర్గాల వారు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సదవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసుల పరిష్కారానికి రాజీమార్గమే సరైనదిగా సూచిస్తూ... ప్రతి పౌరుడు రాజీ మార్గాన్ని ఎంచుకునేందుకు బాధ్యత ఉందని గుర్తుచేస్తూ ఆ దిశగా పునరాలోచన చేయాలన్నారు. కేసుల పరిష్కారంతో ప్రశాంత జీవనం గడిపేందుకు వీలుందని జీవన మార్గం సుగమం అవుతుందన్నారు.



కిట్స్‌లో సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-హసన్‌పర్తి



మండలంలోని ఎర్రగట్టు క్రాసు రోడ్డు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కిట్స్ వరంగల్ స్టాఫ్ క్లబ్, అధ్యాపక సిబ్బంది సభ్యులకు శనివారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. స్టాఫ్ క్లబ్, హెల్తీయన్స్ వెల్‌నెస్ కంపెనీ వరంగల్ వారి సహకారంతో డిస్పెన్సరీ కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో నిర్వహించిన ఆరోగ్య శిభిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన వ్యక్తి సంస్థకు ఉపయోగపడే సేవలను సమర్థవంతంగా చేయగలడన్నారు. ఆరోగ్యమే సంపద, ఆరోగ్యం లేకుండా ఏమీ చేయలేమని దేశ నిర్మాణానికి వైద్య సేవ గొప్ప సేవ అన్నారు. టెక్నాలజీ అభివృద్ధిలోనే కాకుండా మానవుని ప్రాణాలను కాపాడే సామాజిక సేవలో కూడా కిట్స్ వరంగల్ సమాజంలో ముందు వరుసలోఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ స్టాఫ్‌క్లబ్ ప్రెసిడెంట్, సెంటర్ ఫర్ ఐస్క్వేర్ అర్ఈ-హెడ్, ప్రొఫెసర్ కె.రాజనరేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ పి.చిరంజీవి, కోశాధికారి డాక్టర్ కె.రాజేందర్ ప్రసాద్, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్, ఫిజికల్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ డి.ప్రభాకరా చారి, కిట్స్ మెడికల్ సూపర్‌వైజర్ వి.నీలకంఠం, వివిధ విభాగాల డీన్‌లు, వివిధ విభాగాల విభాగాధిపతులు, 100 పై చీలుకు అధ్యాపక సిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల తీర్పు చూసైనా ప్రతిపక్షం మారాలి: మంత్రి శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-మల్హర్‌రావు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును చూసైనా ప్రతిపక్షం రియలైజ్ కావాలని, మారాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో దుద్దిళ్ల మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే సామాజిక న్యాయం జరుగుతుందని, రాష్ట్ర ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుతున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాల నిరుపేద ప్రజలకు భూములు, ఇళ్లు, పోడు భూములన్ని కూడా ఇందిరమ్మ రాజ్యంలోనే వచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించామని చెబుతున్న హరీశ్‌రావు దగ్గర ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజల తీర్పు చూసైనా ప్రతిపక్షాలు రియలైజ్ కావాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ శ్రీజ



నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ)గా పి.శ్రీజ శనివారం బాధ్యతలు చేపట్టారు. అన ంతరం జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్‌గా నియమితులైన పి.శ్రీజ శనివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు కల ెక్టర్ లోకల్ బాడీస్ పి.శ్రీజకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.



నవతెలంగాణ కథనానికి స్పందన

పాఠశాలలో చేరిన ఉపాధ్యాయుడు.. ఆర్డర్ ఇచ్చిన ఎంఈఓ

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్లలోని రామారావుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆ టీచర్ రిలీవ్ అయినట్లా..? కానట్లా..? అనే కథనం ఈనెల 14న నవతెలంగాణ దినపత్రిక వరంగల్ ఎడిసిన్ లో ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ కథనానికి ఎట్టకేలకు విద్యాశాఖ అధికారులు స్పందించి అక్టోబర్ 3న రిలీవైన ఆటీచర్‌ను మూడు నెలల తరువాత యధాస్థానంలోకి వెళ్లి విధులు నిర్వహించాలని శనివారం మండల ఎంఈఓ దేవానాయక్ ఆర్డర్ ఇచ్చినట్లుగా తెలిపారు. మూడు నెలలపాటుగా పాఠశాలలో ఒక్క టీచర్ మాత్రమే ఉండటంతో విద్యార్థులకు బోధన విషయంలో ఇబ్బందులు కలిగాయని, ప్రస్తుతం పాత టీచర్ మళ్ళీ పాఠశాలకు రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యపై పత్రికలో ప్రచురించి విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకపోయి పరిసర్కారమైయ్యేందుకు కృషి చేసిన నవ తెలంగాణ దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అసలు ఎం జరిగిందంటే..

అక్టోబర్ నెలలో గత ప్రభుత్వం జివో 317 ప్రకారం నామ్స్ 1నుంచి 19 వరకు విద్యార్థులు ఉన్న ఉపాధ్యాయులు తమ అనుకూలమైన ప్రదేశాలకు బదిలీలు పెట్టుకోవచ్చని ప్రకటించిన నేపథ్యంలో రామారావుపల్లి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రామారావుపల్లి పాఠశాలలో నామ్స్ లోపు విద్యార్థులు ఉన్నారని తాడిచెర్ల కాంప్లెక్స్ హెచ్‌ఎంకు సమాచారం ఇచ్చి రిలీవ్ పెట్టారు. వెంటనే హెచ్ ఎం పాఠశాలను సందర్శించగా పాఠశాలలో 35 మంది విద్యార్థులకు పైన ఉన్నారు. వెంటనే హెచ్‌ఎం మండల విద్యాధికారికి సమాచారం ఇవ్వడంతో ఎంఈఓ సైతం పాఠశాలను సందర్శించగా పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నట్టుగా తెలిసింది. తప్పుడు సమాచారంతో రిలీవ్ పెట్టుకున్న ఆ ప్రధానోపాధ్యాయురాలు రిలీవ్ ఆర్డర్ ఆపాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎంఈఓ సమాచారం ఇచ్చినట్లుగా తెలిపారు. రిలీవ్ పెట్టుకున్న ప్రధానోపాధ్యాయురాలు మాత్రం భూపాలపల్లి జిల్లాలోని ఘన్‌పూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో నవ తెలంగాణ కథనంతో ఉలిక్కిపడ్డ విద్యాశాఖ అధికారులు ఒక్కటై నీవు తాడిచెర్ల పాఠశాలలోనే విధులు నిర్వహించాలని ఆర్డర్ చేసినట్లుగా తెలిసింది. కాని సత్యాలు నేర్పాల్సిన ఉపాధ్యాయురాలు అసత్యపు మాటలు చెప్పి రిలీవ్ కోసం దరఖాస్తు పెట్టుకున్న ఆటీచర్‌పై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నిలువరిస్తాం

ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రమేశ్

ఏఐటీయుసీలో భారీ చేరికలు



నవతెలంగాణ-కోల్‌బెల్ట్:

ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)ని కార్మికులు ఆదరించి పట్టం కడితే సింగరేణిని కబలిస్తున్న రాజకీయ జోక్యాన్ని నిలువరిస్తామని ఆసంఘం భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేశ్ అన్నారు. శనివారం భూపాలపల్లి ఏరియాలోని కేఎల్‌పీ గనిలో ఫిట్ సెక్రటరీ శంకర్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా రమేశ్ హాజరై మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలిస్తేనే యువ కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.సింగరేణిలో యువ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ మాత్రమే కృషి చేస్తుందన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్నటువంటి టీబీజీకేఎస్ సంఘం కార్మికులకు ఏమి చేయలేదని, కార్మిక సమస్యలు గాలికి వదిలేసి పైరవీలకే పరిమితమై, డబ్బు సంపాదనకు ఎగబడ్డారని ఆరోపించారు. సింగరేణిలో అనుభవిస్తున్నటువంటి హక్కులన్ని ఏఐటీయూసీ సాధించినవేనన్నారు. సింగరేణి కార్మిక శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తూ ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసిన చరిత్ర ఉన్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమే అని తెలిపారు. సింగరేణి సంస్థలో లాభాల వాటా, దీపావళి బోనస్, రఘునాథ్‌రెడ్డి అవార్డు కింద ఇంక్రిమెంట్, ప్రమోషన్లను ఇలా ఎన్నో హక్కులు సాధించిన చరిత్ర ఉన్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, యువ కార్మిక సోదరులు ఆలోచించి, చరిత్ర తెలుసుకొని చుక్క గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి సంస్థను కాపాడుకోవాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ పోరాటాలకు ఆకర్షితులైన సుమారు వందమంది యువ కార్మికులు సంఘంలో చేరగా, వారందరిని రమేశ్ ఏఐటీయూసీ కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈసమావేశంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి ఎం. విజేందర్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, బ్రాంచ్ నాయకులు చంద్రమౌళి, టెక్నీషియన్ ఇంచార్జ్ రవికుమార్, కృష్ణారెడ్డి, బి.శ్రీనివాస్, డి.శ్రీకాంత్, పి.కృష్ణ, ఎండీ.రఫీ, దేవయ్య, సేఫ్టీ కమిటీ సభ్యులు శ్రీనివాస్, మని సాగర్, మొయినుద్దీన్, ఎం.శ్రీనివాస్, ఎం.లింగయ్య, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ అజయ్, గురువయ్య, శ్రుతి తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ పునరుద్ధరణ మా బాధ్యత కాదు

ఎల్అండ్‌టీ సంచలన లేఖ

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన ప్రాంతం పునరుద్ధరణ బా ధ్యత తమది కాదని ఎల్అండ్‌టీ,ప్రాజెక్ట్ ఈఎన్సీ కి సంచలన లేఖ రాసింది. రిపేర్‌కు అయ్యే ఖర్చు మొత్తం భరించడంతో పాటు అనుబంధ ఒప్పందం చేసుకుంటేనే ముందుకెళ్తామని సంస్థ లేఖలో పేర్కొంది. బ్యారేజీ కుంగిన సమయంలో ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఇందుకు భిన్నంగా ప్రకటన చేశారు. నిర్వహణ గడువు ఇంకా ఉందని, పునరుద్ధరణ ఖర్చు మొత్తం నిర్మాణ సంస్థే భరిస్తుందన్నారు.ఎన్నికల సమయంలో ఇంజనీర్లు చేసిన ప్రకటనకు ప్రస్తుతం నిర్మాణ సంస్థ చేస్తున్న ప్రకటనకు పొంతన లేక పోవడంతో మరో సారి ఈ అంశం వివాదాస్పదమవుతోంది. బ్యారేజీ కుంగిన చోట పియర్స్, పిల్లర్లకు ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఆ ప్రాంతంలోకి నీరు రాకుండా మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకు రూ.55.75 కోట్లు ఖర్చు అవుతుందని ఈ మొత్తానికి ఒప్పందం చేసుకోవాలని ఎల్అండ్‌టీ ఈ నెల 2న కాళేశ్వరం ఈఎన్సీ వెంకటేశ్వర్లుకు లేఖ రాసింది. దెబ్బతిన్న బ్యాక్, పియర్స్ ను రిపేర్ చేయడానికి రూ.500 కోట్లు వరకు ఖర్చు అవుతుందని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. తాజాగా ఎల్అండ్‌టీ లేఖలో మేడిగడ్డ బ్యారేజీ పునురుద్ధరణకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలని స్పష్టం చేయడంతో మరోసారి ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ కీలక నేతలు సైతం నిర్మాణ సంస్థ పునరుద్ధరణ పనులు చేపడుతుందని, ఆందోళన చెందాల్సిన పని లేదని ప్రకటించగా తాజా లేఖతో గులాబీ పార్టీ చిక్కుల్లో పడినట్లయింది.

మంత్రి సీతక్కను కలిసిన వెంకటాపూర్ జర్నలిస్టులు

ఇండ్ల స్థలాల మంజూరికి హామీ

మంత్రి సీతక్కను సన్మానించిన జర్నలిస్టులు

నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లా వెంకటాపూర్ మండల జర్నలిస్టులు శనివారం హైదరాబాద్‌కి చేరుకొని ప్రభుత్వంలో కీలక పదవులు చేపట్టిన మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిసారు. వెంకటాపూర్ జర్నలిస్టులు ముందుగా మంత్రి సీతక్కకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేయడంతోపాటు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా జర్నలిస్టులు సీతక్క తో మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఇండ్ల స్థలాల కోసం పలుమార్లు విన్నవించుకున్నా తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే వెంకటాపూర్ జర్నలిస్టులం పాలంపేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 14లోని ప్రభుత్వ భూమిలో రేకులతో కూడిన ఇంటి నిర్మాణాలను చెపట్టి గత 40 రోజులుగా శాంతియుత దీక్ష చేస్తున్నట్లు మంత్రికి వివరించారు. దీంతో స్పందించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. పాలంపేటలోని ప్రభుత్వ భూమిలో రేకులతో ఇండ్లు వేసుకున్న వెంకటాపూర్ జర్నలిస్టులకు ఇంటి స్థలాల మంజూరుతో పాటు పక్కా ఇండ్లు నిర్మించి ఇచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సీతక్క వెంకటాపూర్ మండలంలోని సమస్యలను జర్నలిస్టుల ద్వారా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సైతం కృషి చేస్తానని హామీ ఇచ్చారు మంత్రి సీతక్కను కలిసిన వారిలో జర్నలిస్టులు బేతి సతీష్ యాదవ్, ఒద్దుల మురళీ, పిల్లలమర్రి శివ, దండపెల్లి సారంగం, పిల్లలమర్రి రామ్, ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య, వైద్య సేవలందించాలి: కలెక్టర్ భవేష్‌మిశ్రా



నవతెలంగాణ-మహాముత్తారం

జిల్లా లోని ప్రజలకు మెరుగైన విద్యా , వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం నీతి అయోగ్ సంస్థ నిర్వహిస్తున్న ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ బ్లాక్ లెవల్ ప్రోగ్రాంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వెనుకబడిన మండలాలుగా మహాముత్తారం, పలిమెల మండలాలను ఎంపిక చేసిన నేపథ్యంలో మహాముత్తారం మండలంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం పర్యటించారు. ఈసందర్భంగా బోర్ల గూడెం ప్రాథమిక పాఠశాల, మహాముత్తారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ భవేష్ మిశ్రా సందర్శించారు. బోర్లగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనందించాలని డిజిటల్ క్లాస్ రూంల ద్వారా ఎల్‌ఈడి టీవీ లో 5, 6 తరగతుల విద్యార్థులకు బొమ్మల ద్వారా అర్థవంతమైన విద్యాబోధన అందించాలన్నారు. అనంతరం మహాముత్తారం ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన గురించి అడిగి తెలుసుకొని పదో తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రాన్ని బోధించి గణితంలో మెళుకువలను నేర్పించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ విద్యను మించిన ఆయుధం లేదని బాగా చదువుకుంటే జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థులకు కలెక్టర్ భవేష్ మిశ్రా పుట్టిన రోజు సందర్భంగా మిఠాయిలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అక్కడినుండి మహాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలం దించాలని, నార్మల్ డెలివరీల గురించి గర్భిణీ స్త్రీలకు అవగాహన పెంపొందించి నార్మల్ డెలివరీలు జరిగేలా చూడాలని ఆదేశించారు. పిల్లలకు సరైన సమ యంలో టీకాలు వేసి జబ్బులకు గురికాకుండా చూడాలని, సీజనల్ వ్యాధులపై అప్ర మత్తంగా ఉండాలని, టిబి రోగులను గుర్తించి వారికి సత్వరమే అవగాహన కల్పించి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.అనంతరం కలెక్టర్ భవేష్ మిశ్రా పుట్టిన రోజు సందర్భగా మహాముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి మధుసూదన్, ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీదేవి, ఉమాదేవి, ఉపాధ్యాయులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మేడారం జాతరను విజయవంతం చేద్దాం: అడిషనల్ కలెక్టర్ శ్రీజ

వనదేవతలకు ప్రత్యేక మొక్కలు

నవతెలంగాణ-తాడ్వాయి

వివిధ శాఖల అధికారులు, పూజారులు అందరం కలిసి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 21 నుండి 24వ తేదీ వరకు జరుగు మేడారం మహా జాతరను విజయవంతం చేద్దామని ములుగు జిల్లా నూతన అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీజ అన్నారు. శనివారం నూతనంగా వచ్చిన అడిషనల్ కలెక్టర్ శ్రీజ స్థానిక తహసీల్దార్ తోట రవీందర్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి (డిపిఓ) వెంకయ్యలతో కలిసి మేడారంలోని వన దేవతలను దర్శించుకున్నారు. ఎండోమెంట్ అధికారులు, పూజారులు డోలు వాయిద్యాలతో గిరిజన సంప్రదాయాల ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. సమ్మక్క-సారలమ్మ పగిడిద్దరాజు, గోవిందరాజు వనదేవతలకు ఇష్టమైన పసుపు, కుంకుమ, చీరే, సారే సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. అనంతరం పూజారులు ఎండోమెంట్ అధికారులు శాలువాలు కప్పి నూతన వస్త్రాలు, అమ్మవారి ప్రసాదం సమర్పించి ఘనంగా సన్మానించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్రీజ మేడారం జాతర పరిసరాలను, ఐటీడీఏ గెస్ట్ హౌస్ సమ్మక్క సారక్క భవన్, జంపన్నవాగు, స్నానఘట్టాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సేవలో విధులు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. గతంలో ఆదిలాబాద్ జిల్లాలోని నాగోబా జాతర



నిర్వహించామని, ఇప్పుడు ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క సారల వనదేవతల జాతర విధులు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం రూ.75 కోట్లు నిధులు మంజూరు చేసిందని, భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించి విజయవంతం చేద్దామన్నారు. అంతేకాకుండా ములుగు జిల్లా ను విద్య, వైద్యం పరంగా అన్ని రంగాల్లో ముందు ఉండేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఆమె వెంట జిల్లా పంచాయతీరాజ్ అధికారి వెంకయ్య, తహసీల్దార్ రవీందర్, ఎంపీవో జాల శ్రీధర్, స్థానిక పంచాయతీ కార్యదర్శి కొర్నెబెల్లి సతీష్, ప్రోటోకాల్ అధికారి బొప్ప సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



అదనపు కలెక్టర్ రెవిన్యూ డి. వేణుగోపాల్

నవతెలగాణ-ములుగు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని సమగ్రమైన ప్రణాళికతో, సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ డి.వేణుగోపాల్ అన్నారు. శనివారం ములుగు గ్రామ పంచాయతీ దగ్గర ఈనెల16 నుండి 25 జనవరి వరకు చేపట్టనున్న వికసిత భారత్ సంకల్పయాత్రను అదనపు కలెక్టర్ రెవిన్యూ డి.వేణుగోపాల్ ప్రారంభించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు సామాజిక భద్రత, ఆయుష్మాన్ భారత్, సాధికారతపై మహిళలకు భరోసా, ఆత్మనిర్భర్ భారత్, పీఎం జన్‌దన్, మొదలగు కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, మరింత చేరువ చేయడంలో భాగంగా చేపట్టిన హమారా సంకల్ప్ వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా జిల్లాకు 2 ప్రచార వాహనాలను చేరుకున్నాయని, ఈ నాలుగు వాహనాలు డిసెంబర్ 16 నుండి జనవరి 25, 2024 వరకు ప్రతిరోజు జిల్లాలోని 2 వాహనాల ద్వారా 4 గ్రామాలలో ప్రచార కార్యకమాలను నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎంపిడిఓలు, ఎంపిఓలు రాతపూర్వకంగా రూపొందించి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు, ఎంపీపీ జడ్పిటిసి, ఎంపీటీసీ వార్డు సభ్యులకు, మండలం పరిదిలోని ప్రజాప్రతినిధులకు లిఖితపూర్వకంగా తెలుపాలని సూచించారు. సంబంధితశాఖలకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలలో ఆయా శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాలను గురించి తెలియజేయాలన్నారు. గ్రామాలలో విధులను సక్రమంగా నిర్వహించి అద్భుత ప్రగతి కనబరిచిన క్షేత్రస్థాయి సిబ్బందిని గుర్తించి వారిని సన్మానించాలని తెలిపారు. వాహనం గ్రామానికి చేరుకుని తిరిగి వెళ్లే వరకు పంచాయతీ సెక్రటరీలు బాధ్యత వహించేలా ఆదేశాలను జారిచేయాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎల్‌డి ఎం.రాజ్‌కుమార్, ఏపీ డి బాలస్వామి, ఎస్‌బీఐ ములుగు బ్యాంకు మేనేజర్ జనార్ధన్, లోకల్ బ్రాంచ్ మేనేజర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐటీయూసీ, టీబీజీకేఎస్‌లే ప్రైవేటీకరణను ప్రోత్సహించాయి

ఐఎన్‌టీయూసీ నాయకులు జోగ బుచ్చయ్య

నవతెలంగాణ-కోల్‌బెల్ట్



గతంలో గుర్తింపు పొందిన రెండు కార్మిక సంఘాలు అయిన ఎఐటీయూసీ, టీబీజీకేఎస్‌లు సింగరేణి యాజమాన్యానికి తొత్తులుగా మారి సింగరేణి ప్రైవ ేటీకరణను ప్రోత్స హించాయని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షులు జోగ బుచ్చయ్య ఆరోపించారు. శనివారం భూపాలపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్‌లో ఫిట్ సెక్రెటరీ కూతురు కుమార్ ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్‌కు బుచ్చయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఈనెల 27న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో ప్రసంగించారు. గతంలో ఐఎన్‌టీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు భూపాలపల్లి లోని టీ2 క్వార్టర్స్ బేస్‌మెంట్‌పైన ఇప్పియ్యడం జరిగిందని, మిలీనియం క్వార్టర్స్ నిర్మాణం కూడా చేపట్టింది ఐఎన్‌టీయూసీయేనని సగర్వంగా తెలిపారు. గతంలో గెలిచినటువంటి టీబీజీకేఎస్, ఏఐటీయూసీ యాజమాన్యానికి తొత్తులుగా మారి ప్రైవేటీకరణను ప్రోత్సహించారని వారిని తిరిగి ఎన్నుకుంటే కుక్క తోక వంకర చందంగానే నడుచుకుంటారని, ఐఎన్‌టీయూసీకి అవకాశం కల్పించి యాజమాన్యంపై పోరాడి హక్కులు సాధించగల శక్తిని ఇవ్వాలని, గడియారం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఐఎన్టఈయూసీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను కార్మికులకు వివరించారు.

నేడు మంత్రి సీతక్క మేడారం రాక

భద్రత ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి



నేడు(ఆదివారం మేడారం జాతర సమీక్ష సమావేశానికి విచ్చేస్తున్న పంచాయతీరాజ్ గ్రామీణా భివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ సీతక్క మేడారం రానున్న సంద ర్భంగా శనివారం మేడారంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, పార్టీ శ్రేణులు, ములుగు డీఎస్పీ ఎన్. రవీందర్‌లు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి సీతక్క విజయ యాత్ర నిర్వహించి మేడారంలో వనదేవతలకు మొక్కులు చెల్లించి జాతర నిర్వాణపై వివిధ శాఖల అధికారులు పూజారులతో రివ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్, ఎస్సై ఓంకార్‌యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ పులి సంపత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాటాపూర్ మాజీ సర్పంచ్ ముజఫర్ హుస్సేన్, మండల అధ్యక్షుడు జాలపు అనంతరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవియాదవ్, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బాదం ప్రవీణ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు అరెం లచ్చుపటేల్, డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ములుగుకు మంత్రి సీతక్క రాక..

ఘన స్వాగతానికి పిలుపునిచ్చిన

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్

నవతెలంగాణ-ములుగు



రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి జిల్లాకు వస్తున్న పంచాయతీరాజ్ గ్రామీణా భివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కకు ఘన స్వాగతం పలికేందుకు కార్యకర్తల సిద్ధమవుతున్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మండల అధ్యక్షులు ఎండి.చాంద్ పాషా ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల ముఖ్య నాయకుల సమావేశం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేయగా ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా పైడాకుల అశోక్ హాజరై 17న ఆదివారం(నేడు) ఉదయం 8:30 గంటలకు ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖామంత్రి ఎంపికై, పదవీ బాధ్యతలు చేపట్టి మొట్ట మొదటిసారిగా ములుగు నియోజకవర్గానికి విచ్చేస్తున్న శుభ సందర్భముగా సీతక్కకి మహమ్మద్ గౌస్ పల్లి నుండి ఘన స్వాగతం పలికి విజయోత్సవ ర్యాలీ నిర్వహించాలని, ఈ విజయోత్సవర్యాలీ విజయవంతం చేయడానికి ములుగు జిల్లాలోని అన్ని మండలాల నుండి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకురాళ్ళు, యూత్ నాయకులు అందరూ హాజరయి గజ మాలలతో సీతక్కని సత్కరించి, సత్యాలతో, ఆట పాటలతో విజయోత్సవ ర్యాలిని సంబరాలతో జరుపుకోవాలన్నారు. మహమ్మద్ గౌస్ పల్లి గ్రామం నుండి మేడారం వరకు సాగే విజయోత్సవ ర్యాలీలో ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకుడు హాజరు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మరియు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఇర్సవడ్ల వెంకన్న, జెడ్పీటీసీ కరం చంద్ గాంధీ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షులు కంబాల రవి, మునిసేపల్లి కుమార్‌గౌడ్, బండి శ్రీను, రసపుత్ సీతారాంనాయక్, గుంటోజు శంకర్, నూనేటి శ్యామ్, పొడాల ఓంప్రకాష్, గుండెబోయిన రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నేటి మంత్రి సీతక్క భారీ ర్యాలీని విజయవంతం చేయండి

నవతెలంగాణ-కన్నాయిగూడెం



తెలంగాణ రాష్ట్ర పంచాయతీ శాఖ, శిశు మహిళా సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొట్ట మొదటి సారిగా మన ములుగు గడ్డ మీద అడుగు పెట్టాబోతున్న ధనసరి అనసూయ సీతక్క ఆదివారం ములుగు గట్టమ్మ నుంచి మేడారం వరకు భారీ ర్యాలీగా బయలుదేరనున్నారు. కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీటీసీ శైలజఅరుణ్ కుమార్) కోరారు.

గిరిజన యూనివర్సిటీ స్థల పరిశీలన

నవతెలంగాణ-ములుగు



ములుగులో దేశంలోనే ప్రతి ష్టాత్మకమైన గిరిజన విశ్వ విద్యా లయం ఏర్పాటుకు హైద రాబాద్ యూని వర్సిటీ నుండి విచ్చే సిన దేవేష్ నిగమ్, రిజిస్ట్రార్, బిజె రావు, ఉప కులపతి అభిషేక్ కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్టేట్ లకు ఐటిడి ఎపిఓ అంకిత్, అదనపు కలెక్టర్ రెవిన్యూ డి.వేణుగోపాల్ లు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవా లయం పక్కన కేటాయించిన ప్రభుత్వ భూమిని చూపించి, వివరాలు తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తన చాంబర్ లో హైదరాబాద్ యూనివర్సిటీ నుండి విచ్చేసిన దేవేష్ నిగమ్, రిజిస్ట్రార్ జిల్లా కు కేటాయించిన యూనివర్సిటీ వివరాలను తెలిపారు.అనంతరం యూనివర్సిటీ ఏర్పాటుకు తాత్కాలిక తరగతుల నిర్వహణ కోసం ములుగు మండలం లోని జాకారంలోని వైటిసి భవనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ రెడ్డి జాయింట్ డైరెక్టర్, డిటిడిఓ దేశి రామ్, తహసీల్దార్ విజయభాస్కర్ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోఎస్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

టీఎన్జీవోస్ ములుగు జిల్లా కార్యదర్శి పోలురాజు ఆధ్వర్యంలో ఏటూర్‌నాగారం యూనిట్ ఎన్నిక నిర్వహించారు. .అధ్యక్షులుగా ముసుకు అనిల్ కుమార్, బి.అశోక్ కార్యదర్శిగా వి.మువిన్ కుమార్ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా పి.రజిత ఆర్గనైజింగ్ రేణుక, పబ్లిసిటీ సెక్రెటరీ కె.భిక్షపతి ఈసీ మెంబర్ రియాజ్ ఖాన్, భాను ప్రకాష్ ఉద్యోగస్తులను యూనిట్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో టిఎన్జీవోస్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షులు రాజేశ్వరరావు, కోశాధికారి భూక్య లాలూ నాయక్ , మహిళా అధ్యక్షురాలు చైతన్య ములుగు యూనిట్ కార్యదర్శి ప్రదీప్, సురేష్ రమాదేవి కార్యదర్శి, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

తీర్మానాన్ని రద్దు చేయాలి

నవతెలంగాణ-వెంకటాపురం



11 గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో కలపాలని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తీర్మాణం రద్దు చేయాలని జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. శనివారం జీఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 11 గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతామని గత అసెంబ్లీ తీర్మానాన్ని ఈప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జిల్లా ప్రధన కార్యదర్శి కణితి వెంకటకృష్ణ ఉన్నారు.

విద్యార్థులతో పనులా.. ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-వెంకటాపురం



ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులతో పనులు చేపిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టిఎల్ రవి డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ బృందం తో మండలంలోని పాఠశాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగరాజపురం కాలనీ ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల, కొండాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చిరుతపల్లి గిరిజన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో పని చేయిస్తున్నట్లు గుర్తించామన్నారు. విచారణ నిర్వహించి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో వసతులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, వంశీ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ సింగరేణి కార్మికుల బాడీ ఎన్నిక

నవతెలంగాణ-కోల్ బెల్ట్:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం రిటైర్డ్ సింగరేణి కార్మికుల బాడీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. సుమారు 250 మంది రిటైర్డ్ కార్మికులు పాల్గొని ఏకగ్రీవంగా బాడీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రిటైర్డ్ సింగరేణి కార్మికుల సంఘం అధ్యక్షులుగా గుండేటి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా గీట్ల రాజిరెడ్డి, సెక్రటరీగా కొండపాక సాంబయ్య గౌడ్, ఉపాధ్యక్షులుగా బొట్ల స్వామి, మాడుగుల సమ్మిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గాజర్ల కొమురయ్య గౌడ్, గుజ్జుల సముద్రాల రెడ్డి, 9 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా కమిటీ చేసిన తీర్మాణంలో దిగిపోయిన ప్రతి కార్మికుడికి 200 గజాల ఇంటి స్థలం, పరిస్థితులకనుగుణంగా పెన్షన్‌లో పెరుగుదల కావాలని, సిపిఆర్ఎంఎస్ కార్డు విలువ రూ.8 లక్షల 25 లక్షల పెంచాలని, సింగరేణి వైద్యశాలలో ఉచితంగా వైద్యం అందించాలి కానీ కార్డు నుండి అమౌంట్ రికవరీ చేయకూడదని, విశ్రాంత కార్మికుల సమావేశాల కలయికల నిమిత్తం సింగరేణి యాజమాన్యం విశ్రాంత భవనాన్ని కేటాయించాలని, లేనిపక్షంలో కనీసం స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



మహాదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మడక ప్రతాప్ రెడ్డి, ములకల రమేష్‌రెడ్డి, ఓడేటి లక్ష్మారెడ్డి, బండి శ్రీనివాస్‌లు శుక్రవారం రాత్రి రాష్ట్ర ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబును సచివాలయంలో మర్యాద పూరకం కలిసి పూలబొకే అందజేసి ఘనంగా సన్మానించారు.

సీఐటీయూని గెలిపించండి

భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య



నవతెలంగాణ -కోల్ బెల్ట్:

ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఉదయించే సూర్యుని గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆసంఘం భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-1 గనిలో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్ లో సీఐటీయూ జయశంకర్ జిల్లా అధ్యక్షులు బంధు సాయిలుతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో మేము పెట్టినటువంటి 12 డిమాండ్లు గెలిచిన తర్వాత ఖచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కోల్ ఇండియా లో ఉన్నటువంటి కాలిబు కార్మికులకు రావలసిన హక్కులకు మేము వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

అయ్యప్ప భిక్ష లో పాల్గొన్న దుద్దిళ్ళ శ్రీనుబాబు



నవతెలంగాణ-కాటారం/మల్హర్‌రావు

అయ్యప్ప స్వామి భిక్ష కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహోదరుడు, శ్రీపాద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారేపల్లి లో గల శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో మంత్రి శ్రీధర్ బాబు సౌజన్యంతో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో శ్రీనుబాబు పాల్గొని అయ్యప్ప స్వాముల తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు సామూహిక భిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, వారితో కలిసి శ్రీను బాబు సహ పక్తి భోజనం చేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమునూరు ప్రభాకర్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షులు పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీమల సందీప్, అయ్యప్ప దేవాలయ నిర్వాహకులు బచ్చు అశోక్ గుప్తా, ప్రకాష్ గుప్తా, పీచర్ రామకృష్ణారావు, జనగామ కార్తీక్‌రావు, కరుణాకర్‌రావు, కొట్టే ప్రభాకర్, అంగజాలా అశోక్, జాడి మహేశ్వరి, సుగుణ, విజయ రెడ్డి, బొమ్మన శ్రీనివాస్‌రెడ్డి , ప్రభాకర్ రెడ్డి, కడారి విక్రమ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ-కోల్‌బెల్ట్:

ఈనెల 23 సింగరేణి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సింగరేణి మహిళలకు శనివారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ క్రీడమైదానంలో నిర్వహించిన క్రీడల పోటీలకు ముఖ్యఅతిథిగా ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారం హాజరయ్యారు. క్రీడలలో గెలుపొందిన మహిళలకు 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో జీఎం చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డివైపిఎం శ్యాంప్రసాద్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్, సేవా కోఆర్డినేటర్ ప్రవీణ్, సేవా సెక్రటరీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



రాజీ పడదగ క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు సహకరించాలి: జడ్జీ మాధవీ

నవతెలంగాణ-ములుగు



అత్యధిక రాజీ పడదగ క్రిమినల్ కేసులు పరిష్కారానికి పోలీస్ అధికారులు సహకరించాలనీ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి మాధవి తెలిపారు.జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30 న నిర్వహించబడే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఉద్దేశించి శనివారం ములుగు పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి మాధవి మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించబడే జాతీయ లోక్ అదాలత్ లో అత్యధిక రాజీ పడదగ క్రిమినల్ కేసులు పరిష్కారానికి పోలీస్ అధికారులు సహకరించాలని తెలిపారు. రాజీమార్గం ద్వారా వారి కేసును పరిష్కరించుకునేలా అందరూ సహాయపడాలని తెలిపారు.లోక్ అదాలత్ పట్ల ఎటువంటి న్యాయ సలహా సూచనల కొరకు అయిననూ న్యాయ సేవా అధికార సంస్థలను ఆశ్రయించి, న్యాయ సలహాలు, సూచనలను పొందగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ సుభాష్ బాబు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డిసిఆర్బి ములుగు, స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ లో రికార్డులు తనిఖీ చేసిన ఎఎస్పీ



నవతెలంగాణ-కన్నాయిగూడెం

కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్ ను ఏటూరునాగారం ఏ ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ శనివారం సందర్శించి, కేసులకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. కేసుల పురోగతి పై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్న కేసులు, వాటి పురోగతి, ఎస్సై సురేష్ , పోలీసుల పనితీరుపై చర్చించారు. మండలంలో నేరాలు అదుపులోనే ఉన్నాయని, అప్పుడప్పుడు రోడ్డు ప్రమాదాలు జరిగిన కొద్ది గంటల్లోనే ప్రమాదాలు చేసిన వాహనాలను గుర్తించి అదుపులో తీసుకుంటున్నట్లు ఎస్సై ఎం, సురేష్ ఎస్పీకి విన్నవించారు. పోలీసుల పనితీరు తో పాటు రికార్డుల వివరాలు, ఎప్పటికప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, రోడ్డు భద్రత చర్యలపై పోలీసులు అనుసరిస్తున్న విధానాలు సంతృప్తికరంగా ఉండడంతో ఏఎస్పీ వారిని అభినందించారు.

ఏఎస్పీ వెంట ఏటూరునాగారం సీఐ ఎం.రాజు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్జీవో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

జిల్లా అధ్యక్షుడు బూరుగు రవికుమార్

నవతెలంగాణ-కోల్ బెల్ట్:



ఈ నెల 23న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరగనున్న జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగు రవికుమార్ పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో శనివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా బూరుగు రవికుమార్ మాట్లాడుతూ ఈసమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ నాయకత్వంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈనెల 23న నిర్వహించే జిల్లా స్టాండింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు పాల్గొంటారని, ఉద్యోగులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈసమావేశంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు సామ్యూల్ , ములుగు జిల్లా అధ్యక్షులు జ్ఞానేశ్వర్‌సింగ్, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, కోశాధికారి దశరథ రామారావు, ఉపాధ్యక్షులు శ్రీనాథ్, సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ అలివేలు, జాయింట్ సెక్రెటరీ మనీషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ జమల్, జాయింట్ సెక్రెటరీ అన్వర్బ బేగ్, తాలూకా యూనిట్స్, భూపాలపల్లి సిటీ యూనిట్ అధ్యక్ష , కార్యదర్శులు పోలు ప్రవీణ్, సంగు విజయ్‌బాబులు పాల్గొన్నారు.

మంతి సీతక్కకు స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ

నవతెలంగాణ-గోవిందరావుపేట



మంత్రిగా తొలిసారి నియోజకవర్గానికి విచ్చేస్తున్న మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలికేందుకు ఆదివారం మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం వెంకటకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ములుగు ఎమ్మెల్యే సీతక్క తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖల మంత్రిగా నియమితులై, పదవీ బాధ్యతలు చేపట్టి నేడు(ఆదివారం) ఉదయం 10 గంటలకు మన ములుగు నియోజకవర్గానికి తొలిసారిగా వస్తున్న శుభ సందర్భంగా గోవిందరావుపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మహమ్మద్ గౌస్ పల్లి గ్రామం నుండి ఘనంగా స్వాగతం పలకాలని వెంకటకృష్ణ కోరారు.

ప్రజా సమస్యల్లో ఆదివాసీ నాయకులు భాగస్వామ్యం కావాలి

తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటిడిఏ



రాష్ట్రంలోని ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల్లో ఆదివాసి నాయకులు భాగస్వాములు కావాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 17 జిల్లాల తుడెందెబ్బ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు జిల్లా కమిటీ సభ్యులు ఉట్నూరు, ఏటూరునాగారం, భద్రాచలం, మన్ననూరు జిల్లాలోని ఐటీడీఏ కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల్లో జరగుతున్న ప్రజావాణి కార్యక్రమాలకు నాయకులు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కారం చూపేలా అధికారులతో మాట్లాడాలన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు ఆదివాసీ ప్రజా సమస్యలు అధికారుల ద్వారా పరిష్కారాన్ని చూపాలన్నారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయంగా ఆదివాసీ ప్రజలు ఎదిగేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

నవతెలంగాణ-మల్హర్ రావు

రైతులు దళారులను ఆశ్రయించొద్దని, పండించిన వరి ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని తాడిచెర్ల పిఏసిఎస్ చైర్మన్ రామారావు సూచించారు. మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో దుబ్బపేట, ఆన్‌సాన్ పల్లి, నాచారం, ఎడ్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆన్‌సాన్ పల్లి సర్పంచ్ గుగులోత్ జగన్ నాయక్,భూపాలపల్లి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ జంగిడి శ్రీనివాస్, పిఏసిఎస్ పిఏసిఎస్ డైరెక్టర్లు, సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ములుగు



మండలంలోని కాసిందేవిపేట్ లో ములుగు పిఏసిఎస్ అధ్వర్యంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పిఏసిఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా సత్తి రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాలలో మాత్రమే విక్రయించాలని, దళారులకు అమ్మి మోసపోవద్దని తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ మర్రి రాజు, డైరెక్టర్స్‌లు వేల్పూరి సత్యనారాయణ రావు, రమేష్, సిఈఓ తోట తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

గర్భిణీలు, చిన్నారులకు టీకాలు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



మహాదేవపూర్ మండలం అంబట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కిష్టారావు పేట, రాంల్లికోట గ్రామాలలో ఔట్ రిచ్ సెషన్ లో భాగంగా శనివారం ఇమ్యూనైజేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమములో గర్భిణిలకు చంటిపిల్లలకు చిన్న పిల్లలకు రోగ నిరోధక టీకాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాల పై కేసు నమోదు: ఎస్సై అశోక్

నవతెలంగాణ-వెంకటాపురం

ఎటువంటి పత్రాలు లేనే 15 ద్విచక్రవాహనాలను గుర్తించి వాహన దారులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.అశోక్ పేర్కొన్నారు. శనివారం శివాలయం వద్ద భద్రాచలం-వెంకటాపురం ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలకు సంబంధించి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను సేకరించారు. నెంబర్ ప్లేట్ లేని 15 వాహనాలను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఆర్.అశోక్ వాహన దారులకు పలు సూచనలు అందజేశారు. వాహనాలకు సంబందించి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగివుండలన్నారు. రిజిస్ట్రేషన్ లేని వాహనాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేపించుకోవాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, వాహనం నడిపే వారికి తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగివుండలన్నారు. అతివేగం ప్రమాద కరమని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రుల పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

నవతెలంగాణ-టేకుమట్ల





రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఏం పేడు గ్రామానికి చెందిన మాడగోని శ్రావణ్, పెద్దంపల్లి గ్రామానికి చెం దిన బొల్లి కొండ ఆకాష్, రాకేష్ అనే ముగ్గురు యువకులు కారులో శనివారం తెల్లవారుజామున కరీంనగర్ కు వెళ్తున్న క్రమంలో కరీంనగర్ నుండి హుజరాబాద్ వైపు వస్తున్న లారీ అదుపుతప్పి కారును ఢీకొట్టడంతో మాడగోని శ్రావణ్, బొల్లి కొండ ఆకాష్ అనే యువకులు సంఘటన స్థలంలోనే మృతి చెందడం జరిగిందని, తీవ్ర గాయాలైన రాకేష్ ను చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంతో మహిళ మృతి

నవతెలంగాణ-మహదేవపూర్



మహాదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన ముల్కల రాజమణి(45) ఆమె శనివారం మధ్యాహ్నం సూరారంలో వడ్ల పనిపై ఐకెపి సెంటర్‌కి వెళ్లి తిరిగి నడుచు కుంటూ ఇంటికి వెళ్తుండగా అంబటిపల్లి నుండి మహాదేవపూర్ వెళ్తున్న ఎర్టిగా కార్ నెంబర్ టీఎస్-07-ఈఎఫ్-8510 ను డ్రైవర్ కుర్ర ప్రణీత్ అతడు అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుకుంటూ ముల్కల రాజమణిని ఢీకొట్టగా ఆమెకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చందింది. ఆమె భర్త రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజ్ కుమార్ తెలిపారు. మృతురాలు సూరారం గ్రామ సర్పంచ్ నాగుల లక్ష్మారెడ్డి సోదరి.

అనారోగ్యంతో వృద్ధురాలు గోపమ్మ మృతి

నవతెలంగాణ-మల్హర్ రావు



మండల కేంద్రమైన తాడిచెర్లలో మల్కా గోపమ్మ (90) అనే వృద్ధురాలు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. గోపమ్మ చిన్న కుమా రుడు పుట్టుకతో వందశాతం వికలాంగుడైన హరిని ఏనాడు భారంగా బావించకుండా అన్ని తానై కంటికి రెప్పలా పెంచింది. తల్లి ఆకస్మిక మరణంతో వికలాంగుల పోరాట సమితి (విహెచ్ పిఎస్) ఉద్యమ నాయకుడు మల్కా హరి కన్నీటి పర్యంతమైయ్యాడు.తాను శిశువుగా ఉన్నప్పటి నుంచి నేటి వరకు దాదాపు (50 ఏళ్ళు) తన తల్లి ఒక శిశువులాగే పెంచిందని భావోద్వేగానికి గురై శనివారం తల్లి గోపమ్మను అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకున్నట్లుగా తెలిపాడు. ఈరోజుల్లో వందల కోట్లు, భూములు సంపాదించిన కుమారులు, కూతుళ్ల కొందరు తల్లిదండ్రులు మరణిస్తే కడసారి చూడడానికి రాని పరిస్థితుల్లో హరి కాళ్ళు, చేతులు లేక ఒక్కరి సహాయంతో వెళ్లే పరిస్థితులో ఉన్న అతడు అమ్మ అంత్యక్రియల్లో పాల్గొనడం పలువురిని ఆలోచింపజేసింది. హరి తండ్రి రిటైర్డ్ ఉపాధ్యాయుడు కావడంతో అంత్యక్రియల్లో పలువురు ఉపాధ్యాయ సంఘాలు, వికలాంగుల సంఘాల నాయకులు పెద్దయెత్తున హాజరై గోపమ్మ మృత దేహానికి నివాళులర్పించారు.


ఫోన్ ద్వారా హరికి పరామర్శ

నవతెలంగాణ-మల్హర్ రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామానికి చెందిన వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్)సీనియర్ నాయకుడు మల్కా హరి తల్లి మల్కా గోపమ్మ (90) అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మంథని సామ్యేల్ మాదిగ, మండల అధ్యక్షుడు కేసారపునరేష్ మాదిగ, మంథని మండల అధ్యక్షులు పొట్ల రమేష్ మాదిగ శనివారం పరామర్శించి, అధైర్య పడొద్దని ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆలాగే ఫోన్ ద్వారా హరికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పరామర్శించారు. త్వరలో ఇంటికి వస్తానని, ధైర్యంగా ఉండాలన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం

నవతెలంగాణ-మహాముత్తారం



వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మహాముత్తారం మండలం ప్రజా పరిషత్ కార్యా లయ ఆవరణలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథి గా ఎంపీపీ రత్నం సుభద్ర హాజరై మాట్లాడుతూ దేశ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి, డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డియంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కొమురయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు, ఎంపిఓ ఎం శ్రీనివాస్‌రావు, బ్యాంక్ మేనేజర్ సంతోష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



నవతెలంగాణ-శాయంపేట

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందనిమహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతి బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మోతే రాజకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంజెబిపి గురుకుల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను పురస్కరించుకొని జిల్లాస్థాయి రన్నింగ్, షాట్ పుట్, జావలిన్త్రో క్రీడా పోటీలను నిర్వహించా రు. 8వ తరగతి చదువుతున్న మోహన్ కృష్ణ మొదటి బహుమతి సాధించగా ప్రిన్సి పాల్ రాజ్ కుమార్ అభినందించి ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారి ముసుగులో ఘరానా మోసం

- ప్రేమ పేరుతో నయవంచన
- మోసం చేసిన ప్రియుడు.. పట్టించుకోని తండ్రి..
- న్యాయం కోసం యువతి ఆందోళన
- రెండు రోజులుగా నిరసన
- రక్షణ కోసం పోలీసు, సఖీ సెంటర్ సహాయక చర్యలు
- ప్రశ్నార్థకంగా మారిన ఎంఫార్మసీ యువతి జీవితం
- తల్లి మరణమే ఆడ పిల్లకు శాపమా?
- న్యాయం కోసం అమాయకురాలి ఎదురు చూపులు

నవతెలంగాణ-హసన్‌పర్తి

గొప్ప గొప్ప చదువులు చదువుకొని సమాజంలో ఎలా బతకాలో తెలియని అమాయక యువతులకు అడుగడుగునా మోసాలే.. ఒకడు కామంతో... మరొకడు స్వార్థంతో. ఇంకోకడు అవసరం కోసం అమాయకులైన అబల జీవితాలతో చెలగాట మాడుతూ అన్యాయాలకు పాల్పడుతున్నారు.ఇలాంటి ఘటనలో సమాజంలో ఎన్నో చోటు చేసుకున్నా అబలలైన ఆడపిల్లలు న్యాయం కోసం పడిగాపులు కాస్తూనే ఉన్నారు. జీవితంలో పోరాడి అలసిపోయిన మహిళలు ఎందరో సమాజంలో జీవచ్ఛవంలా బతుకులీడుస్తూనే ఉన్నారు. ఇలాంటి ఘటనే హసన్‌పర్తిలో చోటు చేసుకుంది. బాదితుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే...హసన్‌పర్తికి చెందిన ఓ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగికి ముగ్గురు కూతుళ్లు. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. ఆ దంపతులిద్దరు ఎంతో ప్రేమగా చూసుకుంటూ ఎంతో కష్టపడి వారిని గొప్ప గొప్ప చదువులు చదివించారు. చదివిన చదువులు వారికి జీవితంలో ఏమాత్రం ఉపయోగపడ్డాయో తెలియదు. కానీ వారికి సమాజంలో ఎలా బతకాలో నేర్పించలేకపోయాయి. విశ్రాంత ఉద్యోగి భార్య పిల్లలు చిన్నతనంలోనే ఉండగా మృతి చెందడంతో వారి కుటుంబంలో తీరని దు:ఖాన్ని నింపింది. ఆడపిల్లలకు తల్లి లేని లోటు ఏమిటనేది పెరిగేకొద్ది అర్థం కాలేదు. పెద్ద కూతరు హైదరాబాదులోనే ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పెద్ద ఉద్యోగం చేస్తుంది. రెండో కూతురు ఎంఫార్మసీ, మూడో కూతురు ఫోరెన్సిక్ ఉస్మానియా యూనివర్సిటీలోనే పూర్తి చేసారు.చదువులో తాము ఎవ్వరికి సాటిలేమని నిరూపించుకున్న ఆ ఆడపిల్లలకు మోసపూరిత సమాజంలో ఎలా బతకాలో నేర్పలేదు. ఈ క్రమంలోనే అనారోగ్యంతో తల్లి దూరం కావడం ఆ ఆడపిల్లలు కలిగిన కుటంబానికి శాపంగా మారింది. సంపదకు లోటు లేని ముగ్గురు ఆడపిల్లలు కలిగిన ఆ కుటుంబం మనశ్శాంతికి దూరమై విధి వంచితులుగా కాలం గడుపుతున్నారు.

ప్రేమ పేరుతో నయవంచన

ఎంఫార్మసిలో టాప్‌గా నిలిచిన ఆ యువతి ప్రేమ పేరుతో నయవంచనకు గురైంది. ఆధ్యాత్మిక చింతన కోసం నిర్వహిస్తున్న ఈశ్వరీయ బ్రహ్మకుమారి సంస్థలో ఆ యువతి తరగతులకు హాజరయ్యేది. సంస్థలో ఉద్యోగిగా చేస్తున్న ఆ యువకుడు ఆమెకు ఆధ్యాత్మిక పాఠాలకు బదులుగా ప్రేమ పాఠాలు బోదించాడు. దీంతో ఆ యువతి ఆ యువకుడికి దగ్గరై ఇద్దరు కలిసి వివాహం చేసుకునే వరకు వచ్చింది. అతి తక్కవ కాలంలోనే వారిది విడదీయలేని ప్రేమగా మారింది. దీంతో ఆ యువతి తండ్రి ఆ వివాహానికి నిరాకరించడంతో సమస్య మొదటికి చేరుకుంది. ఎలాగైనా తన తండ్రికి నచ్చజెప్పి ఒప్పించి పెళ్లి చేసుకునేందుకు వారు చేయని ప్రయత్నం లేదు. పెద్ద మనుషులతో కూడా మాట్లాడి సంబంధం కుదుర్చుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికి యువతి తండ్రి నిరాకరించడమే కాకుండా పెద్ద మనుషుల సమక్షంలో తన కూతురు జోలికి రాకూడదని ఒప్పంద పత్రానికి అంగీకరించి ఆ యువకుడు ఆమెకు దూరమయ్యాడు. దీంతో ఆ యువతి మనసిక ఒత్తిడికి గురై మేజర్లమైన మనం వివాహనం చేసుకుందామని ఒప్పించే ప్రయత్నం చేసినప్పటికి ఆ యువకుడు ఆమెను నిరాకరించడంతో పరిస్థితి ఆందోళనకు దారి తీసింది. ఇంత దూరం వచ్చాక తనను ఎలాగైనా వివాహం చేసుకోవాలని యువకుడిని నిలదీసినప్పటికి ఫలితం లేకపోవడంతో ఆమె ఆందోళనకు దిగింది.



న్యాయం కోసం రెండు రోజులుగా ఆందోళన

తనను వివాహం చేసుకొని న్యాయం చేయాలని ఆ యువతి గత రెండు రోజులుగా హసన్‌పర్తి పాతమార్కెట్ వీధిలో ఆందోళనకు దిగింది. బుధవారం రాత్రి వరకు దేవాలయం మెట్ల వద్దే ఆందోళన చేస్తున్న ఆ యువతికి అండగా గ్రామస్తులు నిలిచారు. రాత్రి వేళలో ఆమెకు రక్షణగా నిలిచారు. సఖీ సెంటర్, పోలీసు వారి రక్షణ కోరగా వారు ఆ యువతికి బాసటగా నిలిచారు. ఆ యువకుడి ఆచూకి కోసం వెతికిన పోలీసులకు ఫలితం కనిపించలేదు. దీంతో ఆందోళన చేస్తున్న యువతి తండ్రితో పాటు అక్కడే ఉన్న కూలీపనులు చేసుకుంటున్న వృద్దురాలిని తోడుగా ఉంచి ఆమెకు కాపలాగా నిలిచారు. రెండవ రోజు కూడా ఆ తల్లి లేని యువతికి గ్రామస్తులు స్వల్ప ఆహారం ఇచ్చి అండగా నిలిచారు. మీడియా వారు ఆమెకు బాసటగా నిలిచారు. అయినప్పటికి ఆమెకు న్యాయం జరగలేదు. ఎంతకీ ఆమెకు న్యాయం జరగకపోవడంతో విసిగి వేసారిన ఆ యువతికి గ్రామస్తులు, పోలీసులు, బ్రహ్మకుమారి సంస్థ వారు ఓదార్చి ఎలాగైన న్యాయం జరిగేలా చూస్తామని నచ్చజెప్పి దైర్యం చెప్పి ఇంటికి తరలించారు.

ప్రశ్నార్థకంగా మారిన ఎంఫార్మసీ యువతి జీవితం

న్యాయం కోసం రెండు రోజులుగా గొంతు చించుకొని అరిచినా సమాజంలో ఆదరణ తప్ప జీవితానికి ఓ మార్గం దొరకలేదు. ఎంఫార్మసీలో ర్యాంకర్‌గా నిలిచిన ఆ యువతి జీవితం ప్రశ్నార్థకంగానే మారింది. ప్రేమ పేరుతో నయవంచన చేసి ఆ యువకుడు తప్పించుకున్నాడని ఆ యువతి మానసిక క్షోభకు గురవుతోంది. తల్లి ఆలన లేని తనకు సమాజం అండగా నిలిచి తన జీవితానికి ఏదో ఒక మార్గం చూపిస్తుందని ఎదరి చూసిన ఆమె జీవితం అడవికాచిన వెన్నెలలా మారిందని ఆ యువతి నిరాశకు గురవుతోంది. సమాజంలో ఆడపిల్లగా పుట్టడమే నేరమా? అని ఆవేధనకు గురవుతోంది. తల్లి మరణమే ఆడపిల్లలకు శాపమా లేక సమాజంలో మానవత్వం మృగ్యమైందా అని నిరాశ చెందుతోంది ఆ యువతి. ప్రజాస్వామ్య దేశంలో తనకు ఎప్పటికైనా న్యాయం జరగదా అని ఎదురు చూసే ఆ యువతికి ప్రభుత్వం, సమాజం ఏవిధంగా అండగా నిలిచి ఆమె జీవితానికి మార్గం చూపుతుందో వేచి చూడాల్సిందే.

తల్లిలేని బిడ్డకు మానవత్వంతో అండగా జనం...

తల్లిని కోల్పోయి ప్రియుడి చేతిలో మోసపోయిన ఆ యువతికి సమాజం అండగా నిలిచింది. రెండు రోజులుగా నిరసన తెలుపుతున్న ఆ తల్లిలేని యువతికి న్యాయం జరిగేలా చూస్తామని జనం హామీ ఇచ్చారు. రాత్రింబవళ్లు ఆ యువతిని కంటికి రెప్పలా కాపాడి కడుపులో పెట్టకొని చూసుకున్నారు. ఆకలేస్తే ఆమెకు కావాల్సింది అడిగి తెచ్చి ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎప్పటికైనా నీకు న్యాయం జరిగేలా చూస్తామని ఊరడించి జనం ఆమెను ఓదార్చారు.

ఇద్దరు యువతులు కూడా బ్రహ్మకుమారి బాధితులేనా..?

ఆధ్యాత్మిక చింతన కోసం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సంస్థకు వచ్చిన ఇద్దరు అక్కాచెల్లెలు కూడా బాధితులేనా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఒకరు ప్రేమ పేరుతో నయవంచనకు గురికాగా మరొకరు లైంగిక వేధింపులకు గురైనట్లు బాదితులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా తమ తప్పును కప్పి పుచ్చుకునేందుకు ఇటు బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సంస్థ, అటు నిందారోపణకు గురైన వారు ఇద్దరు యువతులకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపణలు చేయడం వెనక పలు అనుమానాలకు తావిస్తోంది. దీని వెనక అర్థ, అంగ, అధికార బలాన్ని ఉపయోగించుకొని బాధితులకు జరిగిన అన్యాయాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతంలో పెరిగి ఉన్నత చదువులు చదువుకొని అన్యాయానికి గురైన ఆ బాధితుల మొర పట్టించుకొని ఆ కుటుంబానికి అండగా నిలవాల్సిన అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల మౌనం వీడని మిస్టరిగా మిగిలిపోయాయి. మృగ్యమైన వారి జీవితాలకు భరోసా లేక తమలో తామే మదనపడుతూ న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. దిక్కులేని, భద్రత, భరోసాలేని వారి జీవితాల్లో వెలుగులు చూడాలని దేవుడి పై భారం వేసి బాధితులు ఎదురు చూస్తున్నారు. ఇక వారి జీవితాల పట్ల ఎవరు బాధ్యతగా వ్యవహరించి చక్కదిద్దుతారో వేచి చూడాల్సిందే..

ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం చేస్తాం : తుమ్మ గోపి, హసన్‌పర్తి సీఐ

తమకు జరిగిన అన్యాయంపై బాదితులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా న్యాయం చేస్తామని ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. ఉన్నత చదువులు చదివిన ఆ యువతులకు జరిగిన అన్యాయంపై న్యాయ విచారణ జరిపేందుకు తమకు సహకరించాలని ఆయన తెలిపారు. గ్రామంలో యువతి నిరసన తెలిపినప్పుడు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి రక్షణ కల్పించాం. సఖీ సెంటర్ వారితో కౌన్సిలింగ్ చేయించేందుకు సహకరించాం. చట్టం దృష్టిలో అందరు సమానమేనని పోలీసు వ్యవస్థ బాదితుల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు.

రైతులకు భరోసా ఏరుకొండ రవీందర్ గౌడ్

- ఆత్మకూరు సహకార సంఘం చైర్మన్‌గా మెరుగైన సేవలు
- రైతులతో పాటు పేదలకు అండగా ఉంటున్న చైర్మన్

నవతెలంగాణ-ఆత్మకూరు

ఆయన పేదలకు భరోసా కష్టం వచ్చిందంటే నేనున్నానంటూ ధైర్యం ఇస్తారు.వారి సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తాడు. ఆయనే ఆత్మకూరు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్. ఆయన పిఏసిఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రైతుల శ్రేయస్సు కొరకు పనిచేస్తున్నారు. అన్నదాతకు అండగా నిలుస్తూనే పేదల కోసం తాపత్రయపడుతుంటారు. సొసైటీ చైర్మన్ లాంటి నుండి అటు సొసైటీని ఇటు గౌడ సంఘాన్ని బలోపేతం చేస్తూ ఆదర్శంగా తెలుస్తున్నారు. సేవ కార్యక్రమాలు విడివిడిగా చేపడుతూ ముందుకు సాగుతున్నారు.

రైతే రాజు కావాలి' సొసైటీ చైర్మన్ ఎరుకొండ రవీందర్ గౌడ్

రైతులు కావాలని కోరుకునే తనను గెలిపించారు. వారి నమ్మకాన్ని దమ్ము చెయ్యను. రైతులకు ఆత్మకు ప్రజలకు ఎల్లవేళలాగా రుణపడి ఉంటా రైతే రాజు కావాలి ఆ రోజు రావాలని నినాదంతో పనిచేస్తున్న. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని రైతులకు అందజేయడమే నా ముఖ్య ఉద్దేశం. నిత్యం రైతుల బందుబాటులో ఉంటూ నాలుగేండ్లుగా రైతుల పండించిన పంటను కొనుగోలు చేసి దళారుల బారిన పడకుండా చూస్తున్న. ఇప్పటివరకు నాకు సహకరించిన రైతులకు ఆత్మకూరు ప్రజలకు కృతజ్ఞతలు.

సరికొత్తగా ....

ఆత్మకూరు సాహాకార సంఘం ఎదుట ముందు హైదరాబాద్ హుస్సేన్ సాగర్ వద్ద ఏర్పాటు చేసిన తరహాలో హలో ఐలవ్‌యు ఏటికె అను అక్షరాలను ఏర్పాటు చేశారు. అక్కడ యువత సెల్ఫీ దిగుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.సంగం సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించుటకు అనేక చర్యలు తీసుకుంటున్నారు. సాకార సంఘం చైర్మన్ ఎన్నికైన అప్పటినుండి నేటివరకు రూ.3 కోట్లు రుణాలు అందించారు. చిన్న కారు రైతులకు పంట రుణాలు స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా సాయం అందించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా యూరియా 2020 అందేలా ఏర్పాటు చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఇనగాల వెంకట్రామిరెడ్డి, డిసిసి చైర్మన్ మారినేని రవీందర్ రావు సహకారంతో రైతులకు, ప్రజలకు మరింత ఉత్సాహంగా సంఘాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు. ఆత్మకూరు మండలం కేంద్రంతో పాటు చుట్టుపక్క గ్రామాల్లో చనిపోయిన కుటుంబాలకు మేరకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. రైతులకు మండల ప్రజలకు నేనున్నానని భరోసా ఇస్తున్నారు. పీఏసిఎస్ భవనాన్ని అందంగా ముస్తాబు చేశారు.





ఆలయ చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే అరూరి పరామర్శ

నవతెలంగాణ-ఐనవోలు

శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ మజ్జిగ జైపాల్ యాదవ్ ఇటీవల ప్రమాదంలో గాయపడగా శనివారం ఒంటిమామిడి పల్లిలో బీఅర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు.

